ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్
మా కలం - సామాన్యుడి బలం
CELL : 9440352036
# స్వర్ణసాగరం
WWW.SWARNASAGARAM.COM
PRGI : APTEL/26/A1104
జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
9440352036
ఆంధ్రప్రదేశ్ తెలంగాణ

సంపుటి : 1, సంచిక : 176
పేజీలు : 8
శనివారం 12 సెప్టెంబర్ 2026
వెల : 2-00



## సేవల్లో వేగం..
# ఫలితాలే లక్ష్యం

### ప్రజానుకూల ధోరణితో పనిచేయాలి
### సాంకేతికతతో పాటు మానవీయతకు ప్రాధాన్యం

- మార్పు, సమస్యల పరిష్కారంలో అధికారుల నాయకత్వ లక్షణాలే కీలకం
- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రభుత్వం ప్రాధాన్యం
- ప్రజలకు ఇబ్బంది కలగకుండా, శాంతిభద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరించాలి
- జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులతో సీఎం చంద్రబాబు

అమరావతి, స్వర్ణసాగరం

ప్రజలకు అనుకూలంగా అధికారులు పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. సేవలందించడంలో వేగం, జవాబుదారీతనం, ఫలితాలపై దృష్టి పెట్టాలని అన్నారు. ప్రజల విశ్వాసం పొందేలా సాంకేతికతను మానవీయతతో మేళవించాలని కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టర్ల సదస్సు ముగింపు కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ మెరుగైన ఫలితాల కోసం అధికారులు బృంద స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. - మిగతా3లో



## ఢిల్లీ నుంచి అగ్రదేశాలకు
# పుతిన్ సవాల్

- 'బ్రిక్స్' బలమెంతో చెప్పిన రష్యా అధ్యక్షుడు!
- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ వాటా 40 శాతానికి పైగా ఉందన్న పుతిన్

2



## స్టార్టప్‌ల కోసం భారత్‌లో ప్రపంచస్థాయి ఎకోసిస్టమ్

- బ్రిక్స్ దేశాలు దీన్ని వాడుకోవచ్చు: మోదీ
- ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యపర ఆంక్షలు పెరుగుతుంటే, భారత్ ఆర్థిక బంధాల్ని బలోపేతం చేస్తుందన్న మోదీ
- వ్యాపార భాగస్వామ్యాలే వెన్నెముక అని ప్రస్తావించిన పుతిన్
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో ఉందన్న ఇరాన్ అధ్యక్షుడు
- ప్రపంచ జీడీపీతో పోలిస్తే బ్రిక్స్ దేశాల ఆర్థిక వృద్ధి రెట్టింపు వేగంతో దూసుకెళ్తోంది

2



## యువత నిజాయతీగా కష్టపడుతున్నప్పటికీ, ఈ వ్యవస్థ వారిని నిరాశపరుస్తోంది

- విద్యా వ్యవస్థలో జరుగుతున్న పేపర్‌లీక్, అధిక ఫీజుల గురించి ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు
- వ్యవస్థను మార్చాలంటే ప్రతి విద్యార్థి స్వరాన్ని వినడం అత్యవసరమన్న ప్రతిపక్షనేత

## డీఎస్సీ పారదర్శకమైతే జీవోలు
# ఎందుకు మార్చారు?



- 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబుని నిలదీసిన మాజీ సీఎం వైఎస్ జగన్
- డీఎస్సీ సమయంలో ఒక విధానం.. నియామకాలు పూర్తయ్యాక మరో విధానమా?
- కుంభకోణానికి ఈ విధానాలు అవకాశం కల్పించలేదా?
- జరిగిన పరిణామాలకు చంద్రబాబు నైతిక బాధ్యత వహించరా?

అమరావతి, స్వర్ణసాగరం

'డీఎస్సీ సమయంలో ఒక విధానం.. నియామకాలు పూర్తయ్యాక మరో విధానమా? దీన్ని నిష్పక్షపాత, పారదర్శక నియామక ప్రక్రియ అని ఎలా అంటారు? అర్హత పరీక్ష నిబంధన తొలగించడం ద్వారా డీఎస్సీలో అక్రమాలకు ద్వారాలు తెరవలేదా..? జరిగిన పరిణామాలకు చంద్రబాబు నైతిక బాధ్యత వహించరా..?' అని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై సూటి - మిగతా3లో

BRICS 2026

## బ్రిక్స్ సదస్సు
# సర్వం సిద్ధం

- ఏఐ నుంచి వాణిజ్యం వరకు వీటిపైనే ఫుల్ ఫోకస్!
- శని, ఆదివారాల్లో జరిగే 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు సర్వం సిద్ధం
- ఈ మెగా సదస్సుకు హాజరుకానున్న ప్రపంచంలోని పలుదేశాల అగ్రనేతలు
- ముఖ్యంగా చైనా అధినేత జిన్‌పింగ్ ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌కు రానుండటం ఆసక్తి

2

## యథాతథంగా
# ఎక్సైజ్ ట్యాక్స్

- అక్టోబర్ 1 నుంచి కొత్త ఎక్సైజ్ పాలసీ
- దుకాణాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి
- 2026-27 మద్యం విధానంపై ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- మద్యం దుకాణాల మంజూరు, ఫీజుల విధివిధానాలపై మార్గదర్శకాలు విడుదల

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ANDHRA PRADESH
సత్యమేవ జయతే

అమరావతి, స్వర్ణసాగరం


2026-27 ఎక్సైజ్ పాలసీపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మద్యం దుకాణాల మంజూరు, ఫీజుల విధివిధానాలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ కొత్త ఎక్సైజ్ విధానం 2026 అక్టోబర్ 1 నుంచి 2027 సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుంది. కొత్త పాలసీలో మద్యం దుకాణాల సంఖ్యను పెంచడం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 3,396 మద్యం దుకాణాలను ఓపెన్ కేటగిరీలో, మరో 340 దుకాణాలను కల్లుగీత కార్మికులకు రిజర్వ్‌డ్ - మిగతా3లో

## రాష్ట్రంలో 3,736 మద్యం దుకాణాలే..
# ఏడాది పాటు కొనసాగింపు



- మద్యం విక్రయాలపై ఇక డిజిటల్ నిఘా.. ప్రతి దుకాణంలో నాలుగు సీసీ కెమెరాలు
- లైసెన్సుల పునరుద్ధరణకు 38 శాతం ఎక్సైజ్ పన్ను

2



## 'భారత్- రష్యా బంధానికి పునాది వేసింది నెహ్రూనే'

- కాంగ్రెస్ తీవ్ర వ్యాఖ్యలు- బీజేపీ కౌంటర్!
- రష్యాతో మైత్రి క్రెడిట్‌కు సంబంధించి కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం
- రష్యాతో బలమైన సంబంధాలకు నెహ్రూనే కారణమంటున్న కాంగ్రెస్
- దేశాన్ని కాంగ్రెస్ ముంచితే మోదీ నిర్మించారని బీజేపీ కౌంటర్!

2లో

# బ్రిక్స్ సదస్సు సర్వాం సిద్ధం

ప్రపంచ దేశాల చూపు ఇప్పుడు భారత్ వైపు మళ్లింది. అంతర్జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకమైన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని దిల్లీ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. భారత్ అధ్యక్షతన దిల్లీ వేదికగా శని, ఆదివారాల్లో జరిగే 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు ప్రపంచంలోని పలుదేశాల అగ్రనేతలు హాజరవుతున్నారు. రష్యా, చైనా అధ్యక్షులు పుతిన్, జిన్‌పింగ్ సహా 11సభ్య దేశాల అధినేతలు పాల్గొననున్నారు. ముఖ్యంగా చైనా అధినేత జిన్‌పింగ్ ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌కు రావనుండటం ఆసక్తి రేపుతోంది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, వాణిజ్య ఉద్రిక్తతలు, ఆర్థిక సవాళ్ల నడుమ గ్లోబల్ సౌత్ దేశాల అభివృద్ధి ప్రాధాన్యతలను గళమెత్తేందుకు భారత్ ఈ వేదికను సిద్ధం చేసింది. ప్రపంచ జనాభాలో సగం వాటా ఉన్న ఈ బ్రిక్స్ కూటమి దిల్లీ వేదికగా ఏ నిర్ణయాలు తీసుకోబోతోందో ఈ కథనంలో చూద్దాం.

**ఉమ్మడి తీర్మానంపై ఏకాభిప్రాయం కుదురుతుందా?**

ప్రస్తుత ప్రపంచ ఆర్థిక అస్థిరత, ఉక్రెయిన్- పశ్చిమాసియా సంక్షోభాలు, అమెరికా వాణిజ్య- సుంకాల విధానాల నేపథ్యంలో దిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు అంతర్జాతీయంగా అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. “స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం”అనే థీమ్‌తో భారత్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ సదస్సును నిర్వహిస్తోంది. అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమి అయిన గ్లోబల్ సౌత్ ఆర్థికాభివృద్ధికి బ్రిక్స్‌ను ఒక ఇంజిన్‌గా మార్చాలని భారత్ పక్కా వ్యూహంతో అడుగులు వేసింది. ముఖ్యంగా ఆహార భద్రత, కృత్రిమ మేధ, ఇంధన స్థిరత్వం, సప్లై చైన్ సమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా అగ్రనేతలు ఈ వేదికపై సమగ్రంగా చర్చించనున్నారు. అయితే, పశ్చిమాసియా సంక్షోభం విషయంలో సభ్య దేశాలైన ఇరాన్, యూఏఈ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నందున ఈ సదస్సులో ఉమ్మడి తీర్మానంపై ఏకాభిప్రాయం కుదురుతుందా? లేదా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.




**ఏడేళ్ల విరామం అనంతరం తొలిసారిగా జిన్‌పింగ్ భేటీ**

ఈ సదస్సులో ప్రధాన ఆకర్షణగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పాల్గొంటున్నారు. 2020 గల్వాన్ ఘర్షణల తర్వాత దాదాపు ఏడేళ్ల విరామం అనంతరం ఆయన తొలిసారి భారత్‌లో పర్యటిస్తున్నారు. వీరితో పాటు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్-సిసి ఈ సదస్సులో పాల్గొనున్నారు. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ సహా డబ్ల్యూటీఓ, డబ్ల్యూహెచ్ఓ, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధులు కూడా ఈ సమావేశాలకు హాజరుకానున్నారు. ఇంకా ఉగాండా, నైజీరియా, క్యూబా, బెలారస్, వియత్నాం, కజకిస్థాన్ తదితర భాగస్వామ్య దేశాల ప్రతినిధులు ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొంటారని విదేశాంగ శాఖ తెలిపింది.

**ఇక, సదస్సు షెడ్యూల్ విషయానికొస్తే,**

శనివారం మధ్యాహ్నం 02:35 నిమిషాలకు ఇంక్లూసివ్ గ్లోబల్ గవర్నెన్స్ అనే అంశంపై తొలి సెషన్ ప్రారంభమవుతుంది. సాయంత్రం 04:25 నిమిషాలకు భారత్ ఇన్నోవేట్స్ ఎగ్జిబిషన్‌ను నేతలు తిలకిస్తారు. సాయంత్రం 05:05 నిమిషాలకు భారత్ మండపం ప్రాంగణంలో సాంప్రదాయక గ్రూప్ ఫొటో, మొక్కలు నాటే కార్యక్రమం ఉంటుంది. రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చే ప్రత్యేక విందుతో మొదటి రోజు ముగుస్తుంది. ఆదివారం ఉదయం ప్రధాన సమావేశాల అనంతరం దిల్లీ డిక్లరేషన్ విడుదలతో ఈ చారిత్రక సదస్సు ముగియనుంది. కాగా, భారత్ నాల్గోసారి ఈ సదస్సుకు అధ్యక్షత వహిస్తోంది. గతంలో 2012, 2016, 2021లో భారత్ అధ్యక్షత వహించింది. చివరగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ‘దిల్లీ డిక్లరేషన్’ ఆమోదంతో ముగుస్తుంది.

# స్టార్టప్‌ల కోసం భారత్‌లో ప్రపంచస్థాయి ఎకోసిస్టమ్

ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య అడ్డంకులు పెరుగుతున్న సమయంలో భారత్ మాత్రం ఇతర దేశాలతో ఆర్థిక సంబంధాల్ని బలోపేతం చేసేలా ఆర్థిక వారధుల్ని (ఆర్థిక బంధాలు) నిర్మిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు భారత్ సుమారుగా 40 దేశాలతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్స్ కుదుర్చుకుందని ఆయన స్పష్టం చేశారు. దిల్లీలో జరిగిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ లీడర్స్ సెషన్‌లో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. వ్యాపారాలకు అడ్డంకుల్ని తొలగించడం, ఈ రంగంలో సరికొత్త అవకాశాల్ని మరింత విస్తరించడంపైనే భారత్ దృష్టి సారిస్తుందని, ఇదే తమ విధానమని వ్యాఖ్యానించారు. సెప్టెంబర్ 12-13 తేదీల్లో దిల్లీ భారత్ మండపం వేదికగా 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుండగా, దాని ముందస్తు కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ నాయకుల సమావేశం నిర్వహించారు.

“నేడు ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యపరమైన ఆంక్షలు (ట్రేడ్ బారియర్స్) పెరుగుతున్నప్పటికీ, భారత్ మాత్రం ఆర్థిక సంబంధాల్ని బలోపేతం చేస్తోంది. ఆర్థిక వారధుల్ని నిర్మిస్తోంది. 2014 నుంచి మేము దాదాపు 40 దేశాలతో స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నాం. అందుకే బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న ఈ వేళ భారత్ వ్యవసాయం, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, స్మార్ట్ గ్రిడ్స్ వంటి రంగాల్లో కొత్త సహకార నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేశాం.”

**‘ఆ పరిశ్రమలకు మేం ప్రత్యేక ప్రోత్సాహం ఇస్తున్నాం’**

ఇంకా తాము స్టార్టప్స్, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహం ఇస్తున్నామని మోదీ చెప్పారు. ఇందులో భాగంగా బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్,



బ్రిక్స్ ఎంఎస్ఎంఈ పోర్టల్, బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ వంటి వినూత్న వేదికల్ని ప్రారంభించామని, బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు వీటిని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. 2006లో కేవలం 4 దేశాలతో ప్రారంభమైన బ్రిక్స్ ప్రయాణం, ఈ 20 ఏళ్లలో సభ్యులు, భాగస్వాములు కలిపి 21 దేశాల కుటుంబంగా అవతరించిందని ఈ సందర్భంగా మోదీ అన్నారు. ఇప్పుడు ప్రపంచ జనాభాలో సుమారు 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 25 శాతానికిపైగా వాటా బ్రిక్స్ దేశాలదేనని స్పష్టం చేశారు.

ప్రపంచ జీడీపీతో పోలిస్తే బ్రిక్స్ దేశాల ఆర్థిక వృద్ధి రెట్టింపు వేగంతో దూసుకెళ్తోందని మోదీ వ్యాఖ్యానించారు. ఇక ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి నెలకొన్నా భారత్ మాత్రం ఇంధనం నుంచి టెక్నాలజీ వరకు శక్తిమంతమైన సరఫరా వ్యవస్థల్ని ఏర్పాటు చేసిందని, నిలకడగా వృద్ధి, ఆర్థిక స్థిరత్వానికి భారత్ గ్యారెంటీ ఇస్తోందని పేర్కొన్నారు. ఇదే సెషన్‌లో డిజిటల్ పేమెంట్స్ గురించి కూడా ప్రస్తావించారు. భారత సాంకేతికత యూపీఐ ద్వారా ఆర్థిక సేవలు విస్తృతంగా ప్రజలకు చేరాయని, డిజిటల్ ట్రాన్సాక్షన్లకు మరింత ఊతం లభించిందన్నారు. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా జరిగే రియల్ టైమ్ డిజిటల్ పేమెంట్స్‌లో 50 శాతం యూపీఐ టెక్నాలజీనే వినియోగిస్తున్నట్లు చెప్పుకొచ్చారు.

**వ్యాపార భాగస్వామ్యాలే వెన్నెముక- పుతిన్**

బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ప్రసంగించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు, అంతర్జాతీయ సంబంధాల్ని మరింత బలోపేతం చేసేందుకు నమ్మకమైన వ్యాపార భాగస్వామ్యాలే మూలస్తంభాలని, వెన్నెముక వంటివని స్పష్టం చేశారు. బ్రిక్స్ సభ్యదేశాల మధ్య వ్యాపార భాగస్వామ్యాలు పెరుగుతుండటం శుభపరిణామం అన్నారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పులు జరుగుతున్నాయని పుతిన్ వివరించారు. 20వ శతాబ్దం రెండో అర్ధభాగంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించినట్లుగా చెప్పుకుంటున్న అభివృద్ధి చెందిన దేశాల స్థానంలో, ఇప్పుడు కొత్త ఆర్థిక చోదక శక్తులు (గ్లోబల్ గ్రోత్ ఇంజిన్స్) రూపుదిద్దుకుంటున్నాయన్నారు.

**ఇది అత్యంత క్లిష్ట సమయం- పెజెష్కియాన్**

ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో ఉందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అన్నారు. ఇలాంటి సవాళ్లను బ్రిక్స్ సమర్థంగా ఎదుర్కోవాలని బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ నాయకుల సమావేశంలో ఆయన పిలుపునిచ్చారు. సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు పెరిగిపోతున్నాయని పెజెష్కియాన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా రాజకీయ ఒత్తిడి తేవడానికి ఆర్థిక పర ఆంక్షలనే ఆయుధాలుగా వాడుకుంటున్నారని విమర్శించారు.

# ‘భారత్- రష్యా బంధానికి పునాది వేసింది నెహ్రూనే’

దిల్లీ వేదికగా 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో దేశంలో రాజకీయం తీవ్ర స్థాయికి చేరుకుంది. బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ- రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భేటీ వేళ భారత్- రష్యా మైత్రి క్రెడిట్ విషయంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం ప్రారంభమైంది. ప్రధాని మోదీ తన సొంత ప్రచారాన్ని పక్కనబెడితే, ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా బలమైన సంబంధాలే ఉన్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు. 1950- 80ల కాలంలోనే తొలుత అప్పటి ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ హయాంలోనే ఉక్కు నుంచి మొదలుకొని ఇంధనం, రక్షణ, అంతరిక్ష రంగాల్లో రష్యాతో (అప్పటి సోవియట్ యూనియన్) భారత్‌కు బలమైన సంబంధాలకు పునాదులు పడ్డాయని ఆయన గుర్తు చేశారు.

1955లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సోవియట్ యూనియన్‌లో 16 రోజుల పాటు పర్యటన చేయడం, అదే ఏడాది సోవియట్ నాయకులు భారత్‌లో పర్యటించడం ఈ సంబంధాలకు ముఖ్యమైన మలుపుగా జైరాం రమేశ్ అభివర్ణించారు. 1971లో ఆగస్ట్ 9న దిల్లీలో భారత్-సోవియట్ శాంతి, స్నేహం, సహకార ఒప్పందం కుదిరిందని గుర్తు చేశారు. ఇక 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత కొంత కాలం రష్యా- భారత్ సంబంధాలకు బ్రేక్ పడిందని, 1998లో మళ్లీ ప్రిమకోవ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ నాయకత్వంలో సంబంధాలు మళ్లీ బలపడ్డాయని వెల్లడించారు. ఆ తర్వాత వాజ్‌పేయీ, మన్మోహన్ సింగ్ కాలంలో కీలక బ్రహ్మోస్ క్షిపణి ప్రాజెక్ట్



సహా ఎన్నో భాగస్వామ్యాలు విస్తరించాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో సుదీర్ఘ పోస్ట్ చేశారు.

‘దాదాపు ఏడేళ్ల పాటు సాగిన బ్రహ్మోస్ మిసైల్ జాయింట్ వెంచర్ ప్రక్రియను పుతిన్, అప్పటి భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయితో కలిసి తుదిరూపు ఇచ్చారు. ఆ తర్వాత మన్మోహన్ సింగ్ హయాంలో ఈ సహకారం మరింత విస్తరించింది. దిల్లీ, హైదరాబాద్, తిరువనంతపురంలో సంబంధిత కేంద్రాలు ఏర్పాటు చేశారు’ అని జైరాం రమేశ్ తెలిపారు. ఇంకా రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదెవ్ 2010 డిసెంబర్ 22న ఐఐటీ బాంబేను సందర్శించిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

**కాంగ్రెస్ దేశాన్ని ముంచితే మోదీ నిర్మించారు- బీజేపీ ఎదురుదాడి**

అయితే కాంగ్రెస్ విమర్శలపై బీజేపీ కూడా అంతే ఘాటుగా స్పందించింది. విదేశాంగ విధానంపై చర్చ జరిగిన ప్రతిసారీ కాంగ్రెస్ సహా ఇతర పార్టీలు దేశంలో ప్రతికూల వాతావరణం సృష్టిస్తున్నాయని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. కాంగ్రెస్ దేశాన్ని ముంచితే, ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ పునర్నిర్మించిందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో భారత ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉండేదని, అదే ఇప్పుడు మోదీ నాయకత్వంలో ప్రపంచంలోని టాప్- 5 ఆర్థిక వ్యవస్థల్లో భారత్ చేరిందని అన్నారు. ప్రస్తుతం భారత్ బ్రిక్స్‌లోనే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోనూ మంచి స్థానంలో నిలిచిందని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం, సప్లై చెయిన్‌లో అంతరాయాలు, గల్ఫ్‌లో యుద్ధం వంటి సవాళ్లు ఉన్నప్పటికీ భారత వృద్ధి రేటు 7.8 శాతంగా ఉందని తెలిపారు.

**బ్రిక్స్‌లో ఇండియా మాయమయ్యే పరిస్థితి ఉండేది- సంబిత్ పాత్రా**

ఇదే సమయంలో బీజేపీ ఎంపీ, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా మరింత ఘాటు వ్యాఖ్యలు చేశారు. 2011-12 కాంగ్రెస్ పాలన సమయంలో భారత్ అధిక ద్రవ్యోల్బణం, అలాగే రూపాయి అత్యంత కనిష్ఠ స్థాయిలకు పతనం కావడం కారణంగా బ్రిక్స్ కూటమిలోని ‘×- ఫర్ ఇండియా’ స్థానంలో ఇండోనేసియాను చేర్చాలనే కథనాలు వచ్చాయని గుర్తుచేశారు. అదే భారత్ ఇప్పుడు బ్రిక్స్‌లో బలమైన భాగస్వాముల్లో ఒకటిగా నిలిచిందన్నారు. బ్రిక్స్ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడం వల్ల భారత్‌కు ప్రయోజనమేంటి? అని కాంగ్రెస్ ప్రశ్నించిన నేపథ్యంలో బీజేపీ ఇలా స్పందించింది. కిందటి రోజు కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం- బ్రిక్స్ సదస్సుల వల్ల దేశానికి పెద్దగా ఒరిగేదేం లేదని వ్యాఖ్యానించారు.

## ఢిల్లీ నుంచి అగ్రదేశాలకు పుతిన్ సవాల్..



ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం వేగంగా పెరుగుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పైగా ఉందని చెప్పారు. జీ7 దేశాల వాటా 29 శాతమేనని తెలిపారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన ‘బ్రిక్స్ బిజినెస్ ఫోరం’లో పుతిన్ మాట్లాడారు. గత ఐదేళ్ల గణాంకాలను ఆయన ప్రస్తావించారు. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో సగానికి పైగా బ్రిక్స్ దేశాల నుంచే వచ్చిందన్నారు. అదే సమయంలో జీ7 దేశాల వాటా 18 శాతంగా ఉందని చెప్పారు. బ్రిక్స్ ఎదుగుదలను పాశ్చాత్య దేశాలు గమనిస్తున్నాయని పుతిన్ అన్నారు. తమ పోటీ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అవి ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ఈ పోటీ కొన్ని సందర్భాల్లో అసహ్యకర స్థాయికి చేరుతోందని వ్యాఖ్యానించారు. బ్రిక్స్ దేశాల కోసం కొత్త పెట్టుబడి వేదికను ఏర్పాటు చేయాలని పుతిన్ ప్రతిపాదించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా దీనిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు సమీకరించేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. బ్రిక్స్ దేశాలకు భారీ దేశీయ మార్కెట్లు ఉన్నాయని పుతిన్ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం లోతైన మార్పులు జరుగుతున్నాయని చెప్పారు. కొత్త వృద్ధి కేంద్రాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. రష్యాపై 30 వేలకు పైగా ఆంక్షలు ఉన్నాయని పుతిన్ వెల్లడించారు. ప్రపంచం మార్పుల దశలో ఉందని చెప్పారు. ఈ మార్పులు మానవాళి భవిష్యత్తుకు అవసరమని పేర్కొన్నారు.

## యువత నిజాయతీగా కష్టపడుతున్నప్పటికీ, ఈ వ్యవస్థ వారిని నిరాశపరుస్తోంది



భారత విద్యావ్యవస్థపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. లక్షలాది మంది యువత నిజాయతీగా కష్టపడుతున్నప్పటికీ, ఈ వ్యవస్థ వారిని నిరాశపరుస్తోందని మండిపడ్డారు. వ్యవస్థలోని వైఫల్యాలను ప్రతిరోజూ అనుభవిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల గొంతును వినడం ద్వారానే ఈ వ్యవస్థను బాగు చేయడం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో జరుగుతున్న పేపర్ లీకులు, అధిక ఫీజులు, శిథిలావస్థకు చేరుతున్న మౌలిక సదుపాయాల గురించి శుక్రవారం ఎక్స్? వేదికగా ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు.

“భారత విద్యా వ్యవస్థ ఏ తరాన్ని అయితే ఉన్నత స్థాయికి తీసుకురావాలో అనుకుంటుందో, అదే తరాన్ని విఫలం చేస్తోంది. అయితే, ప్రతిరోజూ దాని వైఫల్యాలను అనుభవిస్తున్న వారి మాటలు వినడం వల్లే ఆ సమస్యను సరిద్దిదడం సాధ్యమవుతుంది. కాబట్టి, విద్యా వ్యవస్థపై మీరు ఎందుకు ఆశ కోల్పోయారు? విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మీ అనుభవాలను నాతో పంచుకోండి.”

విద్యావ్యవస్థలో లోపాలకు సంబంధించిన అనుభవాలను తనతో పంచుకోవాలని రాహుల్ ఒక ఆన్‌లైన్ లింక్‌ను షేర్ చేశారు. అందరం కలిసి మళ్లీ ఆశలను చిగురింపజేద్దామని ఆయన పిలుపునిచ్చారు. కాగా, విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి నిర్వహించనున్న ఛాత్రోం కీ గూంజ్? కార్యక్రమాన్ని ఈ నెల 19న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరగనుంది. వ్యవస్థను మార్చాలంటే ప్రతి విద్యార్థి స్వరాన్ని వినడం అత్యవసరమని ఆయన నొక్కి చెప్పారు. గాంధీ కోటా, డేహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్, పుణెలో నాలుగు సమావేశాలను నిర్వహించారు. ఆగస్టు 22న పుణెలో జరిగిన చివరి కార్యక్రమం ప్రత్యేకంగా విద్యార్థినుల కోసం నిర్వహించారు.

**‘యువతతో మాట్లాడేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా’**

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ యువతతో కలిసి మాట్లాడేందుకు తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని రాహుల్ అన్నారు. అయితే, కేవలం కొద్దిమందితో మాట్లాడితే ఈ సమస్యకు పరిష్కారం దొరకదని, దేశంలోని ప్రతి ఒక్క విద్యార్థి స్వరాన్ని, వారి బాధను, వారి విలువైన అభిప్రాయాలను వినడం చాలా ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. గురువారం తన ఎక్స్ పోస్టులో రాహుల్ గాంధీ ఈ మేరకు పోస్టు పెట్టారు. ‘నేడు అస్తవ్యవస్థమైన విద్యా వ్యవస్థ మీ ఆశల జ్వాలను ఆర్పేసి, మీ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసిన తీరును దేశం మొత్తం గమనిస్తోంది’ అని పేర్కొన్నారు. అందుకే యువత ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి ‘ఛాత్రోం కీ గూంజ్?’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. దేశంలోని వివిధ నగరాల్లోని యువతను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకుంటున్నానని చెప్పారు. ఇందులో భాగంగానే సెప్టెంబర్ 19వ తేదీన మరోసారి యువత ముందుకు రానున్నట్లు తెలిపారు.

**బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం**

ఇదిలా ఉండగా, ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమంపై అప్పట్లో బీజేపీ, కాంగ్రెస్? మధ్య మాటల యుద్ధం జరిగింది. ఛాత్రోం కీ గూంజ్? కార్యక్రమాన్ని ‘పైసే కీ గూంజ్’ (డబ్బుల గర్జన) అని బీజేపీ ఎద్దేవా చేసింది. తమ రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ విద్యార్థుల పేరు చెప్పుకొని ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందని తీవ్ర విమర్శలు గుప్పించింది. ప్రజలను సమీకరించేందుకు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు భారీగా డబ్బు చెల్లించిందని ఆరోపించింది. అయితే, బీజేపీ చేసిన ఆరోపణలపై విపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి. జెన్ జీలో కాంగ్రెస్‌కు పెరుగుతున్న మద్దతుని చూసి బీజేపీ భయపడుతోందని వ్యాఖ్యానించాయి. ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు అధికార పార్టీ చేస్తున్న ప్రయత్నాలను చూస్తుంటే రాహుల్ గాంధీ విషయంలో బీజేపీ నిజంగా భయపడినట్లే కనిపిస్తోందని ఎన్‌సీపీ(ఎస్‌పీ) నేత రోహిత్ పవార్ పేర్కొన్నారు.

## ఆర్మీ వెపన్స్ చోరీ కేసులో షాకింగ్ ట్విస్ట్.. పాక్ ఆయుధ డీలర్‌తో మల్లేశ్‌కు సంబంధాలున్నాయా?

బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ వెపన్స్ చోరీ కేసులో దర్యాప్తు కొలిక్కి వస్తున్న కొద్దీ కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న హవాల్దార్ మల్లేశ్‌కు పాకిస్థాన్‌కు చెందిన ఆయుధ డీలర్లతో సంబంధాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మల్లేశ్ సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించిన అధికారులకు పలు అనుమానాస్పద అంశాలు కనిపించినట్లు సమాచారం. అతడు ఇన్‌స్టాగ్రామ్‌లో పాకిస్థాన్‌కు చెందిన ఓ ఆయుధ డీలర్‌ను ఫాలో అవుతున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది. సదరు పాక్ డీలర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో వివిధ రకాల షాట్‌గన్స్, ఏకే-47 తుపాకులకు సంబంధించిన వీడియోలను పోస్టు చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించినట్లు సమాచారం. దీంతో మల్లేశ్ ఆ ఖాతాను ఎందుకు ఫాలో అయ్యాడు? అతడికి ఆ డీలర్‌తో ఏమైనా ప్రత్యక్ష సంబంధాలున్నాయా? అనే అంశాలపై పోలీసులు దృష్టి సారించారు.

# సేవల్లో వేగం.. ఫలితాలే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

పాలనను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. సమస్యలను నిర్లక్ష్యం చేస్తే అవి మరింత జటిలమవుతాయని హెచ్చరించారు. గత 27 నెలల్లో ప్రభుత్వం అనేక సవాళ్లను ఎదుర్కొని వివిధ వ్యవస్థల్లో మార్పులు తీసుకొచ్చిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. సమర్థవంతమైన శాంతిభద్రతలు సుపరిపాలనకు కీలకమన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులు అందిస్తున్న సహకారాన్ని సీఎం అభినందించారు. రాయలసీమ అభివృద్ధి కార్యక్రమంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందన్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త ఊపు వచ్చిందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తితో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడ్డాయని చెప్పారు. సీడ్ యాక్సెస్ రోడ్డుతో అమరావతికి మెరుగైన అనుసంధానం ఏర్పడిందన్నారు. అమరావతి ప్రణాళికాబద్ధమైన, నివాసయోగ్యమైన నగరంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత ధరల ఆధారంగా రాష్ట్ర వృద్ధిరేటు 13.44 శాతంగా అంచనా వేయగా, వస్తు సేవల పన్ను వసూళ్లు 18 శాతం పెరిగాయని తెలిపారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి వృద్ధి అంచనాలు జాతీయ సగటు కంటే అధికంగా ఉన్నాయని వివరించారు. జిల్లాల్లో అమలు చేస్తున్న పలు వినూత్న కార్యక్రమాలు ఉత్తమ విధానాలుగా నిలుస్తున్నాయని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో డ్రోన్ల ప్రాజెక్టు, అనంతపురంలో క్రీడా పాఠశాలలు, బాపట్లలో స్వర్ణ భవిత పాఠశాల, చిత్తూరులో డిజిటల్ విద్య, కర్నూలులో ఎల్‌నినో ప్రభావం తగ్గించేందుకు పీఎండీఎస్ ఆధారిత చర్యలు, ప్రకాశంలో వ్యర్థాలను సంపదగా మార్చే కార్యక్రమం, శ్రీ సత్యసాయి జిల్లాలో బయోచార్ కార్యక్రమాలను సీఎం ప్రస్తావించారు. క్రీడా పాఠశాలల ద్వారా ప్రతిభావంతులైన యువతను గుర్తించి ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు సిద్ధం చేయవచ్చన్నారు. మార్పు తీసుకురావడంలో నాయకత్వం కీలకమని సీఎం పేర్కొన్నారు. రెండు రోజుల సదస్సులో కొత్త ఆలోచనలు, విధాన నిర్ణయాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చ జరిగిందన్నారు. సమర్థులైన సిబ్బందిని ప్రోత్సహించాలని, వారి నైపుణ్యాలను పెంచాలని సూచించారు. పెట్టుబడి ప్రతిపాదనలకు ప్రభుత్వం అనుమతులు ఇస్తే, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనన్నారు. ఇప్పటికే అనుమతులు పొందిన పరిశ్రమలకు భూముల కేటాయింపులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కొంతమంది అధికారుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధి ఆగకూడదన్నారు. పరిశ్రమలు, సేవలు, వ్యవసాయం రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి వృద్ధికి ప్రధాన ఆధారాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో లోటు వర్షపాతం నమోదైందని సీఎం చెప్పారు. పరిస్థితిని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. తాగునీరు, పశువులకు నీరు, పశుగ్రాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కరువు కారణంగా ఉత్పత్తి తగ్గి ధరలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సంక్షోభాన్ని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్మాణ కాలపట్టిక రూపొందించిన 36 ప్రాధాన్య సాగునీటి ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు ఎప్పుడూ తొలి ప్రాధాన్యం ఇస్తానని చంద్రబాబు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజకీయ ఒత్తిళ్లకు తావు లేదన్నారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి, మాదకద్రవ్యాల నేరాలు, మహిళలు, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసులు ప్రజలకు అనుకూలంగా ఉంటూనే శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరారు. ముఖ్యమంత్రి పర్యటన పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు. తన కాన్వాయ్ కోసం 15 నిమిషాల ముందే ట్రాఫిక్ నిలిపివేయవద్దని పోలీసులకు సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా తన కాన్వాయ్‌ను తగ్గించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రాజకీయ పాలనా విధానాన్ని అనుసరిస్తోందని సీఎం చెప్పారు. ప్రజాప్రతినిధులను గౌరవిస్తూ చట్టానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం చేసిన పనికి అధికారులు పూర్తిగా అండగా నిలవాలని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని కోరారు. భోగాపురం విమానాశ్రయం, వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాల్లో ప్రజలు చూపిన ఉత్సాహాన్ని ఆయన ప్రస్తావించారు. అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేస్తే వారు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. అభివృద్ధిని అడ్డుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సుమారు 350 పిటిషన్లతో అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరిగినా డీఎస్సీ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని చెప్పారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించి పోలీసు కానిస్టేబుళ్ల నియామకాలకు మార్గం సుగమం చేశామని తెలిపారు. గ్రూప్–1 పరీక్షలపై వచ్చిన ఆరోపణలపై హైకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణకు ఆదేశించిందన్నారు. గత ప్రభుత్వం వదిలివెళ్లిన 1.53 లక్షల మెట్రిక్ టన్నుల పాత వ్యర్థాలను తొలగించేందుకు ప్రభుత్వం రెండేళ్లు కృషి చేసిందని చెప్పారు. గతంలో ఏర్పడిన భూవివాదాలను పరిష్కరించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉద్యోగులు, పోలీసు సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తూ కరువు భత్యం, సరెండర్ సెలవుల ప్రయోజనాలను విడుదల చేస్తున్నామని చెప్పారు. ప్రతి నిర్ణయాన్ని వేగంగా తీసుకోవాలని సీఎం సూచించారు. అయితే నిర్ణయాల్లో పొరపాట్లకు తావివ్వకూడదన్నారు. ప్రతి నిర్ణయంలో మానవీయ కోణం ఉండాలని స్పష్టం చేశారు. అత్యాధునిక సాంకేతికత ఆధారంగా సాగుతున్న పాలనలో నాయకత్వం అత్యంత కీలకమని చంద్రబాబు నాయుడు తెలిపారు.

# రాష్ట్రంలో 3,736 మద్యం దుకాణాలే.. ఏడాది పాటు కొనసాగింపు

అమరావతి, మహానగర్

రాష్ట్రంలో 2026–27 సంవత్సరానికి నూతన మద్యం దుకాణాల విధానాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న 3,736 మద్యం దుకాణాల సంఖ్యను యథాతథంగా కొనసాగిస్తూ 2026 అక్టోబర్ 1 నుంచి 2027 సెప్టెంబర్ 30 వరకు ఏడాది పాటు ఈ విధానం అమలు చేయనుంది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అనంతరం కూడా పొడిగించే అవకాశం కల్పించింది. మొత్తం 3,736 దుకాణాల్లో 3,396 దుకాణాలను బహిరంగ విభాగంలో, 340 దుకాణాలను గీత కులాలకు కేటాయించారు. ఎక్సైజ్, గనులు, భూగర్భశాస్త్ర శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. 2019–24 మధ్య అమలు చేసిన ఎక్సైజ్ విధానాలు, ప్రస్తుతం అమల్లో ఉన్న 2024–26 దుకాణాల విధానం అనుభవం, వివిధ వర్గాల నుంచి వచ్చిన అభిప్రాయాలు, మార్కెట్ పరిస్థితులు, ప్రభుత్వ ఆదాయ అంశాలను పరిశీలించిన అనంతరం 2026–27 విధానాన్ని ఖరారు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుత లైసెన్సుదారులకు తమ దుకాణాల లైసెన్సులను మరో ఏడాది పునరుద్ధరించుకునే అవకాశం కల్పించారు. ఇందుకోసం వార్షిక చిల్లర ఎక్సైజ్ పన్నులో 38 శాతానికి సమానమైన పునరుద్ధరణ చిల్లర ఎక్సైజ్ పన్ను చెల్లించాలి. దీనితో పాటు వార్షిక చిల్లర ఎక్సైజ్ పన్ను, వర్తించే అనుమతి గది చిల్లర ఎక్సైజ్ పన్నును కూడా చెల్లించాల్సి ఉంటుంది. 2026–27లో వార్షిక చిల్లర ఎక్సైజ్ పన్నును 2025–26లో అమల్లో ఉన్న రేట్ల ప్రకారమే కొనసాగించారు. పునరుద్ధరణ చిల్లర ఎక్సైజ్ పన్నును మొదటి విడత వార్షిక చిల్లర ఎక్సైజ్ పన్నుతో కలిపి ఒకేసారి చెల్లించాలి. 50 వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో బహిరంగ విభాగం దుకాణాలకు పునరుద్ధరణ చిల్లర ఎక్సైజ్ పన్ను రూ.23 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.27.2 లక్షలు, 5 లక్షలకు పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.35.5 లక్షలుగా నిర్ణయించారు. గీత కులాలకు కేటాయించిన దుకాణాలకు ఇదే కేటగిరీల్లో వరుసగా రూ.11.5 లక్షలు, రూ.13.6 లక్షలు, రూ.17.8 లక్షలుగా నిర్ణయించారు. వర్తించే దుకాణాలకు అనుమతి గది లైసెన్సు తప్పనిసరి కాగా, ఇందుకు నిర్దేశించిన అనుమతి గది చిల్లర ఎక్సైజ్ పన్నును చెల్లించాలి. వార్షిక చిల్లర ఎక్సైజ్ పన్నును ప్రభుత్వం నిర్ణయించిన వాయిదాల్లో చెల్లించే అవకాశం ఉంది. వాయిదాల్లో చెల్లించే లైసెన్సుదారులు మూడు నెలల వార్షిక చిల్లర ఎక్సైజ్ పన్ను వాయిదాకు సమానమైన మొత్తానికి బ్యాంకు హామీ సమర్పించాల్సి ఉంటుంది. ప్రస్తుత లైసెన్సుదారులు పునరుద్ధరణ కోసం రూ.35 వేల ప్రక్రియ రుసుము చెల్లించాలి. ఎవరైనా లైసెన్సును పునరుద్ధరించుకోకపోతే ఆ దుకాణాన్ని కొత్తగా లాటరీ పద్ధతిలో కేటాయిస్తారు. ఇందుకోసం దరఖాస్తుదారులు రూ.1,000 తిరిగి చెల్లించని దరఖాస్తు రుసుము చెల్లించాలి. కనీసం నాలుగు అర్హత కలిగిన దరఖాస్తులు వచ్చిన తర్వాతే లాటరీ నిర్వహిస్తారు. కొత్తగా లాటరీ ద్వారా కేటాయించిన దుకాణాలకు పునరుద్ధరణ చిల్లర ఎక్సైజ్ పన్ను వర్తించదు. అమ్ముడుపోని లేదా కేటాయించబడని దుకాణాలను అవసరాన్ని బట్టి తిరిగి ప్రకటించడం, ప్రాంతాల వారీగా హేతుబద్ధీకరించడం లేదా స్థానాలను మార్చడం వంటి చర్యలు చేపట్టేందుకు కూడా విధానంలో అవకాశం కల్పించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎక్సైజ్ కమిషనర్ నిర్ణయిస్తారు. మద్యం సరఫరా వ్యవస్థపై డిజిటల్ నిఘాను ప్రభుత్వం మరింత బలోపేతం చేసింది. ఉత్పత్తి కేంద్రం నుంచి చిల్లర దుకాణం వరకు మద్యం కదలికను పర్యవేక్షించే గుర్తింపు, అనుసరణ విధానాన్ని అమలు చేయనున్నారు. దుకాణాల్లో నిల్వలు, విక్రయాల వివరాలను డిజిటల్‌గా నమోదు చేయాలి. దీనివల్ల మద్యం నిల్వలు, విక్రయాలపై శాఖకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుంది. ప్రతి మద్యం దుకాణంలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం తప్పనిసరి చేశారు. విక్రయ కౌంటర్, నిల్వల ప్రాంతం, వినియోగదారుల ప్రాంతం, అనుమతి గదిని కెమెరాలు కవర్ చేయాలి. వీటిని కృత్రిమ మేధ ఆధారిత నియంత్రణ కేంద్రానికి అనుసంధానం చేసి పర్యవేక్షిస్తారు. సీసీ కెమెరాలను కావాలనే పనిచేయకుండా చేయడం లేదా వాటిలో జోక్యం చేసుకోవడంపై జరిమానాలు విధించడంతో పాటు, పునరావృతమైతే లైసెన్సు రద్దు చేసే అవకాశం ఉంటుంది. మద్యం విక్రయాల్లో గరిష్ఠ చిల్లర ధర నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. గరిష్ఠ చిల్లర ధర కంటే ఎక్కువకు విక్రయించరాదు. నిర్దేశిత ప్రమాణాలకు విరుద్ధమైన మద్యం, నకిలీ మద్యం విక్రయించడం, వివిధ బ్రాండ్ల మద్యం కలపడం, మద్యంలో నీరు లేదా ఇతర పదార్థాలు కలపడం, అనధికారికంగా నిల్వలు ఉంచడం వంటి చర్యలకు పాల్పడరాదు. ఈ నిబంధనల అమలును ఎలక్ట్రానిక్ నిల్వల నమోదు విధానం ద్వారా పర్యవేక్షిస్తారు. అనధికారికంగా మద్యం విక్రయించిన మొదటి నేరానికి రూ.25 లక్షల జరిమానా విధిస్తారు. రెండోసారి నిబంధనలను ఉల్లంఘిస్తే లైసెన్సు రద్దు చేసే అవకాశం ఉంటుంది. ఇతర ఉల్లంఘనలకు కూడా విధానంలో నిర్దేశించిన మేరకు జరిమానాలు, చర్యలు తీసుకుంటారు. వినియోగదారులకు ఫిర్యాదులు, అభిప్రాయాలు తెలియజేసే అవకాశం కల్పించారు. దుకాణాల్లో గరిష్ఠ చిల్లర ధర వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలి. వినియోగదారులు 14405 టోల్‌ఫ్రీ నంబర్, ఏపీ ఎక్సైజ్ సురక్ష అనువర్తనం, సంకేత చిత్ర ఆధారిత అభిప్రాయ సేకరణ ద్వారా తమ ఫిర్యాదులు, అభిప్రాయాలను తెలియజేయవచ్చు. డిజిటల్ చెల్లింపులకు కూడా అవకాశం కల్పించారు. మద్యం నాణ్యతను ఎక్సైజ్ శాఖకు చెందిన ప్రయోగశాలల ద్వారా పరీక్షించనున్నారు. అక్రమ మద్యం తయారీ, అనధికార విక్రయాలు, ఇతర ఉల్లంఘనలపై తనిఖీలు, చర్యలు కొనసాగుతాయి. వినియోగదారులు, లైసెన్సుదారులకు నిబంధనలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తిరుపతి నగరంలో మద్యం దుకాణాల ఏర్పాటుపై ప్రత్యేక నిబంధనలు విధించారు. తిరుపతి రైల్వే స్టేషన్––అలిపిరి, లీలామహల్––అలిపిరి––ఎస్వీఆర్ఆర్/ఎస్వీఐఎంఎస్ మార్గాల్లో ఉత్తర్వుల్లో పేర్కొన్న ప్రాంతాల్లో మద్యం దుకాణాలకు అనుమతి ఉండదు. జాతీయ రహదారులకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కూడా పాటించాలి. మద్యం సీసాల పునర్వినియోగానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం తరువాత రూపొందిస్తుంది. లైసెన్సుదారులు ఎక్సైజ్ శాఖ ఎప్పటికప్పుడు జారీ చేసే ఆదేశాలు, లైసెన్సు నిబంధనలు, సంబంధిత చట్టాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ చట్టం––1968, ఏపీ ఎక్సైజ్ నిబంధనలు––2024తో పాటు సంబంధిత ఇతర చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా కొత్త విధానం అమలు కానుంది. కొత్త విధానానికి అనుగుణంగా అవసరమైన నిబంధనల్లో మార్పులు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అన్ని రకాల పన్నులు, రుసుములు చెల్లించడం, నిబంధనలు పాటించడం ఆధారంగానే లైసెన్సుల పునరుద్ధరణ, కొనసాగింపు ఉంటుంది. 2026–27 మద్యం దుకాణాల విధానం 2026 అక్టోబర్ 1 నుంచి 2027 సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుంది. ఆర్థిక శాఖ సమ్మతితో ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

# సంబరాలే కాదు.. మా సత్తా చూపిస్తాం

## భారత్‌తో మ్యాచ్‌పై జపాన్ కెప్టెన్



ఇంటర్నెట్ డెస్క్: సెప్టెంబర్ 22.. జపాన్ క్రికెట్ అభిమానులకు గుర్తుండిపోయే రోజు. టీమ్‌ఇండియాతో జపాన్ తొలిసారి టీ20 మ్యాచ్‌ను ఆడనుంది. బేస్‌బాల్‌ను ఎక్కువగా ఇష్టపడే జపాన్‌లో క్రికెట్ విస్తరణతో పాటు.. భారత్–జపాన్ ద్వైపాక్షిక సంబంధాల 75వ వార్షికోత్సవాలకు సూచికగా ఈ మ్యాచ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే టికెట్లన్నీ సేల్ అయిపోయినట్లు జపాన్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఇక ఆసియా గేమ్స్ (ూాంఋఖఅ +ఖఎవం 2026) కూడా జపాన్‌లోనే జరగనున్న సంగతి తెలిసిందే. తాజాగా పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో జపాన్ కెప్టెన్ కెండెల్ కడోవాకి ఫ్లెమింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. "ఈ మ్యాచ్ కోసం మేం చాలా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాం. జపాన్‌లో పెద్ద ఎత్తున క్రికెట్ వృద్ధికి ఉపయోగపడుతుందని భావిస్తున్నా. అఫ్గానిస్థాన్, నేపాల్ వంటి జట్లూ ఇక్కడికి వస్తున్నాయి. రెండేళ్ల క్రితం వరకూ ఈ జట్లతో మ్యాచులను నిర్వహించడమూ కష్టమని భావించేవాళ్లం. కానీ, ఇప్పుడు భారత్ (ఎఖఎ ×అఎఋఖ) వంటి పెద్ద టీమ్‌కు ఆతిథ్యం ఇవ్వబోతున్నాం. కేవలం ఆ సందర్భాన్ని ఆస్వాదించడానికి మాత్రమే కాదు.. ఓ జట్టుగా మేం ఏం చేయగలమో నిరూపించుకోవడమే మా ముందున్న లక్ష్యం. అన్ని విభాగాల్లోనూ భారత్ అత్యుత్తమైన టీమ్. ప్రపంచ స్థాయి ఆటగాళ్లతో ప్రత్యక్షంగా ఆడటం గొప్ప అనుభూతిని ఇస్తుందనడంలో సందేహం లేదు. ఐసీసీ పూర్తి సభ్య దేశాలతో పోటీపడటమనేది సుదీర్ఘ చరిత్రలో మొదటి అడుగు అవుతుందని ఆశిస్తున్నా" అని కెండెల్ (Japan Captain) తెలిపాడు.

# డీఎస్సీ పారదర్శకమైతే జీవోలు ఎందుకు మార్చారు?

-మొదటిపేజీ తరువాయి

ప్రశ్నలు సంధించారు. నియామకాలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్న ఉద్దేశం ఉంటే.. అర్హత పరీక్ష అవసరం లేదంటూ జీవోలు ఎందుకు జారీ చేశారని సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయిన తర్వాత పాత పరీక్ష ఆధారిత నియామక విధానాన్ని తిరిగి తీసుకొచ్చేలా నిబంధనలు ఎందుకు మార్చారని నిలదీశారు. ఈ పరిణామాలను నిష్పక్షపాత, పారదర్శక నియామక ప్రక్రియగా ఎలా పరిగణిస్తారని జగన్ ప్రశ్నించారు. డీఎస్సీ కుంభకోణానికి ఈ విధానాలు అవకాశం కల్పించలేదా? అని ధ్వజమెత్తారు. ఈ మేరకు శుక్రవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. తాను మాట్లాడిన వీడియోను ట్యాగ్ చేశారు. అందులో ఆయన ఏమన్నారంటే..

' క్వాలిఫైయింగ్ పరీక్ష నిబంధనను పక్కనపెట్టి నియామకాలను ఎందుకు చేపట్టారు?

' డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తయిన తర్వాత మళ్లీ పాత విధానాన్ని ఎందుకు అమలు చేశారు?

' అర్హత పరీక్ష నిబంధన తొలగించడం ద్వారా డీఎస్సీ అక్రమాలకు ద్వారాలు తెరవలేదా?

' నిబంధనలను మార్చి అక్రమాలకు అవకాశం కల్పించడంపై చంద్రబాబు సమాధానం చెప్పరా?

# యథాతథంగా ఎక్సైజ్ ట్యాక్స్

-మొదటిపేజీ తరువాయి

కేటగిరీలో కేటాయించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రస్తుతం ఉన్న దుకాణాలకు వర్తిస్తున్న రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను యథాతథంగా కొనసాగించనున్నారు. ఓపెన్ కేటగిరీ దుకాణానికి రూ.60.5 లక్షలు : 50 వేలలోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో ఓపెన్ కేటగిరీ దుకాణానికి రూ.60.5 లక్షలు, రిజర్వ్‌డ్ కేటగిరీకి రూ.30 లక్షల ఫీజును నిర్ణయించారు. 50 వేల నుంచి 5 లక్షల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో ఓపెన్ కేటగిరీకి రూ.71 లక్షలు, రిజర్వ్‌డ్ కేటగిరీకి రూ.35 లక్షల ఫీజు వసూలు చేయనున్నారు. 5 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాలు, పట్టణాల్లో ఓపెన్ కేటగిరీ దుకాణానికి రూ.93.5 లక్షలు, రిజర్వ్‌డ్ కేటగిరీకి రూ.46.8 లక్షల ఫీజు నిర్ణయించారు. పర్మిట్ రూమ్‌లకు రూ.5 లక్షలు : అదేవిధంగా పర్మిట్ రూమ్‌లకు రూ.5 లక్షలు, రూ.7.5 లక్షల ఫీజులను వసూలు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రతి మద్యం దుకాణం, పర్మిట్ రూమ్ వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి చేసింది. అలాగే జిల్లాల్లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాల్లో ఏఐ ఆధారిత కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

# నేతన్నలకు ఊరట

అమరావతి

నూతన నేతన్న భరోసా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్న చేనేతలకు ఊరటనిచ్చేలా కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. నేతన్న భరోసా పథకం కింద పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే చేనేతలు బ్యాంకు స్టేట్ మెంట్ అందజేయాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. మాస్టర్ వీవర్ నుంచి వేతనాలు తీసుకున్న వివరాలు అందజేస్తే సరిపోతుందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని రకాల పెన్షన్లు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల ఏడో తేదీ నుంచి వద్ధ్యాప్యం, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, చేనేత సహా అన్ని రకాల పెన్షన్లకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో నేతన్న భరోసా పెన్షన్ కు దరఖాస్తు చేస్తుకుంటున్న నేతన్నలకు బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్ నిబంధన తీవ్ర ప్రతిబంధకంగా మారింది. మాస్టర్ వీవర్ దగ్గర పనిచేసే చేనేతలకు వ్యక్తిగతంగానే వేతనాలు చెల్లిస్తూ వస్తుంటారు. అటువంటి సమయంలో బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్ నిబంధన పెట్టడంతో చేనేతలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఇదే విషయమై పలువురు నేతన్నలు, చేనేత సంఘాల ప్రతినిధులు మంత్రి సవిత దష్టికి సమస్యను తీసుకొచ్చారు. తక్షణమే ఆమె స్పందించి, సీఎం చంద్రబాబునాయుడు దష్టికి చేనేతల సమస్యను తీసుకెళ్లారు. బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్ నిబంధనను సడలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో, అర్హులైన చేనేతలందరికీ నేతన్న భరోసా పెన్షన్లు అందజేసే అవకాశం కలిగిందని మంత్రి సవిత తెలిపారు. నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంకు ఖాతా స్టేట్ మెంట్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలందరికీ నేతన్న భరోసా పెన్షన్లు అందజేస్తామని, అర్హులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ఆయా జిల్లాల చేనేత, జౌళి శాఖాధికారులు బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్లు లేకున్నా దరఖాస్తులు తీసుకోవాలని ఆదేశించారు.

# యువతలో పెరుగుతున్న వెరికోస్ వీన్స్

హైదరాబాద్

నగరంలో 25 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న పురుషులు, యువతలో వెరికోస్ వీన్స్ సమస్య పెరుగుతోందని కిమ్స్ హాస్పిటల్స్ వాస్కులర్ అండ్ ఎండోవాస్కులర్ సర్జరీ హెడ్ డాక్టర్ నరేంద్రనాథ్ మేడా తెలిపారు. ఇది కేవలం సౌందర్య సమస్య కాదని, రక్తప్రసరణ లోపానికి సంకేతమని పేర్కొన్నారు. సిరల్లోని కవాటాలు సరిగా పనిచేయకపోవడంతో రక్తం వెనక్కి ప్రవహించి కాళ్లలో పేరుకుపోవడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుందన్నారు. కాళ్లలో బరువు, నొప్పి, వాపు, అలసట, దురద వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఎక్కువసేపు నిలబడటం లేదా కూర్చోవడం, శారీరక శ్రమలేని జీవనశైలి, ఊబకాయం, గర్భధారణ, వంశపారంపర్య అంశాలు ప్రధాన కారణాలని వివరించారు. ప్రారంభ దశలో జీవనశైలి మార్పులు, ప్రత్యేక కంప్రెషన్ సాక్సులతో సమస్యను నియంత్రించవచ్చున్నారు. అవసరాన్ని బట్టి థర్మల్ అబ్లేషన్, స్క్లెరోథెరపీ, మెడికల్ గ్లూ వంటి ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కాళ్లలో సిరలు స్పష్టంగా కనిపించడం, వాపు లేదా అసౌకర్యం కొనసాగితే నిర్లక్ష్యం చేయకుండా వాస్కులర్ నిపుణులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో చికిత్స తీసుకోవడం ద్వారా చర్మం రంగు మారడం, కణజాల నష్టం, సిరల పుండ్లు వంటి సమస్యలను నివారించవచ్చని డాక్టర్ నరేంద్రనాథ్ మేడా తెలిపారు.ద

# శతక్కొట్టిన కానర్.. సౌతాఫ్రికాదే సిరీస్

నమీబియాతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను పర్యాటక సౌతాఫ్రికా మరో మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకుంది. తొలి వన్డేలో భారీ విజయం (99 పరుగుల తేడాతో) సాధించిన ప్రొటీస్ జట్టు.. ఇవాళ జరిగిన రెండో వన్డేలో అంతకంటే భారీ విజయం (157 పరుగుల తేడాతో) సాధించి సిరీస్‌ను సొంతం చేసుకుంది. విండ్‌హోక్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 9 వికెట్ల నష్టానికి 335 పరుగులు చేసింది. ఓపెనర్ కానర్ ఎస్టర్‌హుయిజెన్ సూపర్ శతకం (110 బంతుల్లో 119; 8 ఫోర్లు, 6 సిక్సర్లు)తో చెలరేగగా.. వన్‌డౌన్ బ్యాటర్ టోనీ డి జోర్జి (79) అర్ధ సెంచరీతో రాణించాడు.

swarna sagaram_Swarna sagaram.qxd 9/11/2026 10:05 PM Page 1



# శ్రీసిటీని సందర్శించిన మద్రాస్ ఈస్ట్ రోటరీ క్లబ్ ప్రతినిధుల బృందం







**శ్రీసిటీ,స్వర్ణ సాగరం సెప్టెంబర్ 11, 2026:**

రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఈస్ట్ (=జవీజు)కు చెందిన 22 మంది సభ్యుల ప్రతినిధి బృందం శుక్రవారం శ్రీసిటీని సందర్శించింది. క్లబ్ అధ్యక్షురాలు రోటేరియన్ రాధిక సత్యనారాయణ నేతృత్వంలో వచ్చిన ఈ బృందంలో పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, వివిధ వృత్తి రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు. శ్రీసిటీలోని ఆర్చురా ఫార్మా ఎండీ, క్లబ్ సభ్యుడు విక్రమ్ ఈ పర్యటనను సమన్వయం చేశారు.శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రపంచస్థాయి మౌళిక వసతులు, వ్యూహాత్మక ప్రయోజనాలు, సమగ్ర పారిశ్రామిక వాతావరణం, అంతర్జాతీయ పెట్టుబడులకు శ్రీసిటీ ఎలా ఆకర్షణీయ గమ్యస్థానంగా ఎదిగిందనే అంశాలను వివరించారు.అనంతరం జరిగిన సమావేశంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఈస్ట్ ప్రతినిధి బృందాన్ని శ్రీసిటీకి ఆహ్వానించడం ఆనందంగా ఉందన్నారు. శ్రీసిటీ సమగ్ర పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ గురించి తెలుసుకోవాలన్న వారి ఆసక్తిని అభినందించారు. వారి అభిప్రాయాలు మాకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తున్నాయన్నారు. సమగ్ర, సుస్థిర పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించాలన్న మా దార్శనికతకు అవి అనుగుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే నిబద్ధత కలిగిన వివిధ రంగాల ప్రముఖులతో కూడిన =జవీజు నెట్‌వర్క్ ద్వారా సమాజానికి అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. పర్యటనకు సహకరించిన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఈస్ట్ అధ్యక్షురాలు రోటేరియన్ రాధిక సత్యనారాయణ, ఈ పర్యటన ఎంతో ఆసక్తికరంగా, విజ్ఞానదాయకంగా సాగిందన్నారు. శ్రీసిటీ మౌలిక వసతులు, సమగ్ర ప్రణాళిక తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. శ్రీసిటీ మరింత అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు.శ్రీసిటీ అధికారులతో చర్చల సందర్భంగా పారిశ్రామికవాడ నిర్వహణ, వివిధ కార్యకలాపాలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత (జూ=) కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై ప్రతినిధుల బృందం వివరాలను అడిగి తెలుసుకుంది. అనంతరం శ్రీసిటీ పరిసరాలతో పాటు హావెల్స్, వరుణ్ బెవరేజెస్ (పెప్సికో) పరిశ్రమలను వారు సందర్శించారు.

# పని చేసినా కూలీ రాలేదంటున్న కృష్ణయ్య!

## ఓజిలి రాచపాళెంలో ఉపాధి పనులపై బాధితుడి ఆవేదన.. అధికారుల తీరుపై విమర్శలు

**ఓజిలి(స్వర్ణ-సాగరం)సెప్టెంబర్ 11:**

పేదలకు ఉపాధి కల్పించి, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న వికసిత భారత్--గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) (వీబీ--జీ రామ్ జీ) పథకం క్షేత్రస్థాయిలో ఎంతవరకు సక్రమంగా అమలవుతోంద న్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తిరుపతి జిల్లా ఓజిలి మండలం రాచపాళెం గ్రామానికి చెందిన మంగళపూరి కృష్ణయ్య అలియాస్ భీమయ్య తనకు కేటాయించిన పనిదినాలు పూర్తయ్యాయని, అయినప్పటికీ మరొకరి స్థానంలో పని చేస్తే డబ్బులు ఇస్తామని చెప్పడంతో పని చేశానని, తాను పనిచేసిన రోజులకు పూర్తి కూలీ అందలేదని ఆరోపించారు.శుక్రవారం ఓజిలిలో సంబంధిత కార్యాలయం వద్ద విలేకరుల ఎదుట తన ఆవేదనను వ్యక్తం చేసిన కృష్ణయ్య.. తాను చేసిన పనికి సంబంధించిన కూలీ మొత్తాన్ని పూర్తిగా చెల్లించాలని, తన విషయంలో సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను కోరారు.

**"పని నేను చేశాను.. కూలీ మాత్రం పూర్తిగా రాలేదు"**

కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తనకు కేటాయించిన పని దినాలు పూర్తయ్యాయని ఫీల్డ్ అసిస్టెంట్ చెప్పినట్లు ఆరోపించారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ భర్త స్థానంలో పని చేస్తే కూలీ ఇస్తామని చెప్పడంతో తాను పనికి వెళ్లినట్లు తెలిపారు. సుమారు ఐదు వారాల పాటు పని చేసినప్పటికీ రెండు వారాలకు సంబంధించి రూ.1,200 మాత్రమే చెల్లించారని, మిగిలిన మొత్తాన్ని ఇవ్వలేదని ఆరోపించారు.తాను పనిచేసిన మొత్తం రోజులకు సంబంధించి కూలీ చెల్లింపులు సక్రమంగా జరగలేదని కృష్ణయ్య వాపోయారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ప్రయత్నించిన సమయంలో "డబ్బులు ఇస్తాను" అంటూ తనను ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు.

**ఒకరి స్థానంలో మరొకరు పని చేయాల్సిన పరిస్థితి ఎందుకు?...**ఈ ఘటనలో అసలు పరిశీలించాల్సిన అంశం ఇదేనని స్థానికులు పేర్కొంటున్నారు. పథకం కింద పని కేటాయింపు, హాజరు నమోదు, పని చేసిన వ్యక్తి వివరాలు, మస్టర్ రోల్, కూలీ చెల్లింపులు వంటి అంశాలు నిర్దిష్ట విధానంలో నమోదవుతాయి. అలాంటప్పుడు పని



కేటాయించిన వ్యక్తికి బదులుగా మరొకరు పని చేసే పరిస్థితి ఎలా ఏర్పడింది? అన్న ప్రశ్నకు అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.కృష్ణయ్య నిజంగానే ఇతర వ్యక్తి స్థానంలో పని చేశారా? అలా అయితే ఆ పని దినాలు ఎవరిపేరుతో నమోదయ్యాయి? మస్టర్ రోల్‌లో ఎలాంటి వివరాలు ఉన్నాయి? కూలీ ఎవరికి జమ అయింది? పని చేసిన వ్యక్తికి చెల్లించాల్సిన మొత్తం ఎంత? ఇప్పటికే ఏమైనా చెల్లింపులు జరిగాయా? అనే అంశాలను రికార్డుల ఆధారంగా పరిశీలిస్తే వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**రాచపాళెం పనులపై సమగ్ర తనిఖీ చేయాలన్న డిమాండ్ద...**రాచపాళెం గ్రామంలో గత కొంతకాలంగా ఇదే పథకం అమలుపై పలు అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమవుతున్నాయని బాధితులు చెబుతున్నారు. గతంలో కూడా సంబంధిత మండల స్థాయి అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినప్పటికీ ఆశించిన స్థాయిలో పరిష్కారం లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో కేవలం ఒక వ్యక్తి ఫిర్యాదుకే పరిమితం కాకుండా రాచపాళెం గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా అమలైన ఉపాధి పనులపై మస్టర్ రోల్స్, పని దినాలు, హాజరు వివరాలు, కూలీ చెల్లింపులు, పనుల ప్రదేశాలు, కొలతలు, సంబంధిత రికార్డులు సమగ్రంగా పరిశీలించాలని బాధితులు కోరుతున్నారు.అవసరమైతే రికార్డుల్లో నమోదైన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవంగా పనులు జరిగాయా లేదా అన్న అంశాన్ని కూడా అధికారులు నిర్ధారించాలని వారు కోరుతున్నారు.

**ఫీల్డ్ విజిట్ చేస్తేనే వాస్తవాలు బయటపడతాయా?**

మండల స్థాయి అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పరిశీలిస్తే ఇలాంటి ఆరోపణలకు స్పష్టమైన సమాధానం లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ప్రత్యేకంగా ఏపీఓ స్థాయి అధికారి ఆధ్వర్యంలో సంబంధిత గ్రామాల్లో ఆకస్మిక క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి, లబ్ధిదారులు, కూలీలు, మస్టర్ రోల్స్, పనుల ప్రదేశాలను సరిపోల్చి పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి వెలుగులోకి వస్తుందని వారు అంటున్నారు.మండలంలో ఉపాధి పనుల అమలును పర్యవేక్షించాల్సిన అధికారులపై కూడా జవాబుదారితనం ఉండాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను కేవలం మొక్కుబడి విచారణతో ముగించకుండా ఆధారాలతో పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.


**జిల్లా స్థాయి విచారణకు కృష్ణయ్య విజ్ఞప్తి**

తాను నిరక్షరాస్యుడినని, తనకు అధికారిక రికార్డులు పరిశీలించే పరిజ్ఞానం లేదని కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాను చేసిన పనికి సంబంధించిన పూర్తి కూలీ అందకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని చెబుతున్నారు.తన ఫిర్యాదుపై జిల్లా స్థాయి అధికారులు స్వతంత్రంగా విచారణ చేపట్టి, తన పేరు మీద నమోదైన పని దినాలు, మస్టర్ రోల్, చెల్లింపుల వివరాలు, బ్యాంకు లావాదేవీలు తదితర అంశాలను పరిశీలించి నిజానిజాలు తేల్చాలని ఆయన కోరుతున్నారు.పేదలకు ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన పథకంలో పని చేసిన ప్రతి కూలీకి నిబంధనల ప్రకారం కూలీ అందేలా చూడటం అధికారుల బాధ్యత. కాబట్టి కృష్ణయ్య ఆరోపణలపై అధికారులు స్పందించి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది.కృష్ణయ్య ఆరోపణలు నిజమా? రికార్డుల్లో ఏం ఉంది? రాచపాళెంలో గతంలో జరిగిన పనుల అమలు ఎలా ఉంది? అన్న ప్రశ్నలకు సమగ్ర విచారణతోనే సమాధానం లభించనుంది. బాధితుడి ఆరోపణలు నిజమని నిర్ధారణ కావాల్సి ఉన్నప్పటికీ, వాటిపై నిష్పాక్షిక విచారణ జరిపించాల్సిన అవసరం మాత్రం ఉందని స్థానికులు కోరుతున్నారు.

# వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రెండు రోజులు ఘనంగా ప్రాజెక్ట్ ఎక్స్‌పో-2026


**స్వర్ణ సాగరం పూతల పట్టు సెప్టెంబర్ 11**

పి. కొత్తకోట: వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యార్థుల సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను వెలికితీసే ఉద్దేశంతో రెండు రోజులు (10/09/2026) �డ (11/09/2026) ప్రాజెక్ట్ ఎక్స్‌పో-2026 ను ఘనంగా నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు సుమారు 200 ప్రాజెక్టులను ప్రదర్శించారు.విద్యార్థులు వ్యవసాయ ఆధారిత, వైద్య ఆధారిత, సాంకేతికత ఆధారిత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక అవసరాలు మరియు నూతన ఆవిష్కరణలకు సంబంధించిన వివిధ ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారాలు చూపించే ప్రాజెక్టులతో పాటు, సమాజానికి ఉపయోగపడే వినూత్న సాంకేతిక ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి.విద్యార్థులు తమ ప్రాజెక్టుల రూపకల్పన, పనితీరు, ఉపయోగాలు మరియు భవిష్యత్ ప్రయోజనాలను సందర్శకులకు వివరించారు. ప్రాజెక్టుల ద్వారా విద్యార్థుల సృజనాత్మక ఆలోచనా విధానం, సమస్య పరిష్కార నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం మరియు ప్రాక్టికల్ నాలెడ్జ్ స్పష్టంగా ప్రతిబింబించాయి.ఈ ప్రాజెక్ట్ ఎక్స్‌పోకు ఇతర విద్యాసంస్థల విద్యార్థులు కూడా హాజరయ్యారు. కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి సుమారు 45 మంది విద్యార్థులు గురుకుల పాఠశాల, పి. కొత్తకోట నుంచి 70 మంది విద్యార్థులు ఎక్స్‌పోను సందర్శించి వివిధ సాంకేతిక విభాగాలు మరియు ప్రాజెక్టులపై అవగాహన పొందారు. అలాగే ఆదర్శ జూనియర్ కళాశాల, చిత్తూరుకు చెందిన 70 మంది



విద్యార్థులు కూడా ప్రాజెక్ట్ ఎక్స్‌పోను సందర్శించి వివిధ స్ట్రీమ్స్, సాంకేతిక రంగాలు మరియు భవిష్యత్ విద్యా, వైద్య, ఉద్యోగ అవకాశాలపై విలువైన జ్ఞానాన్ని పొందారు.ఈ సందర్భంగా కళాశాలలోని అన్ని విభాగాల హెచ్‌ఓడీలు విద్యార్థులను ప్రోత్సహిస్తూ, ప్రాజెక్టుల రూపకల్పన నుంచి వాటి అమలు వరకు అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందించారు. విద్యార్థులు తమ ఆలోచనలను ఆచరణలోకి తీసుకు వచ్చేలా అధ్యాపకులు అందించిన ప్రోత్సాహం కార్యక్రమంలో ప్రత్యేకంగా నిలిచింది.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. నవీన్ కిలారి గారు ప్రాజెక్ట్ ఎక్స్‌పో లో విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభను, వారి కృషి, ఉత్సాహం, సృజనాత్మకత, అంకితభావం మరియు వివిధ స్థాయిల్లో ప్రాజెక్టులను రూపొందించి విజయవంతంగా అమలు చేసిన తీరును ఆయన అభినందించారు.విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్, సమస్య పరిష్కార నైపుణ్యాలు మరియు సాంకేతిక ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవడానికి ఇటువంటి ప్రాజెక్ట్





ఎక్స్‌పోలు ఎంతో దోహదపడతాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. వ్యవసాయం, సాంకేతికత మరియు సమాజ అవసరాలకు అనుగుణంగా మరిన్ని వినూత్న ప్రాజెక్టులను రూపొందించే దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర విద్యాసంస్థల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డా. ఎస్. లీలా లక్ష్మి గారు కన్వీనర్‌గా వ్యవహరించి, కార్యక్రమాన్ని సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు.

RNI : APTEL/26/A2367 OFFICE : 9440352036
SWARNA SAGARAM TELUGU DAILY
స్వర్ణసాగరం
తిరుపతి తెలుగు దినపత్రిక
చిత్తూరు | నెల్లూరు | అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలి





**స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ**

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులను ఉద్దేశించి మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, తద్వారా సమాజాన్ని పట్టి పీడిస్తున్న మూఢనమ్మకాలను తరిమి కొట్టాలని, ఎందరో శాస్త్రవేత్తలు మీకు పూర్తిగా నిలవాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ టాలెంట్ టెస్ట్ కు మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాల నుండి ప్రథములుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్లివెట్టు విద్యార్థులు దీక్షిత, సృజిని, సుభాషిణి, ప్రైవేటు పాఠశాల ఎస్. వి. ఆర్.విద్యార్థులు వర్షిణి,ఓంకార్ నాయుడు, గగన్ ప్రథములుగా నిలిచారు.మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 27వ తారీఖున జిల్లా స్థాయిలో తిరుపతిలోని సైన్ సెంటర్ లో జరుగుతుందని విద్యార్థులు తప్పక హాజరవ్వాలని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు చెంగయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు సుబ్రమణ్యం, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు, రచయిత యువశ్రీ మురళి, ఉపాధ్యాయులు ధనంజయ, శ్రీనివాసులు , పాఠశాలల ఉపాధ్యాయులు తదితరు పాల్గొన్నారు.

# సత్యవేడులో ఘనంగా మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు



**స్వర్ణ సాగరం, సత్యవేడు.**

తిరుపతి జిల్లా సత్యవేడు పట్టణంలో రాజంపేట ఎంపీ, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తనయుడు మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్ఆర్సిపి పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు.శుక్రవారం స్థానిక డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద వైయస్ఆర్సీపీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు కార్యకర్తలు మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సుశీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ ప్రస్థానంలో మిథున్ రెడ్డి ప్రత్యేక ముద్ర వేశారన్నారు. రాష్ట్ర రాజకీయాల్లోనూ క్రియాశీలంగా వ్యవహరిస్తున్నట్టు ఆయన గుర్తు చేశారు. మిథున్ రెడ్డికి ఆయురారోగ్యాలు,రాజకీయంగా మరింత ఉన్నత స్థానాలు లభించాలని ఆకాంక్షించారు.ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా మెలుగుతూ వైఎస్ఆర్సిపిని బలోపేతం చేయడంలో మిథున్ రెడ్డి పాత్ర కీలకమన్నారు. అంతకుమునుపు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు ఏవీఎం బాలాజీ రెడ్డి తో కలిసి సుశీల్ కుమార్ రెడ్డి వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలు,అభిమానులు మధ్య కేక్ కట్ చేసి మిథున్ రెడ్డి జన్మదిన సంబరాలు జరుపుకున్నారు . ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు ఎంపిటిసి బాలయ్య,ఎంపీ రవి,శ్రీధర్ రెడ్డి,పునీత్ కుమార్, పలని,సురేష్ కుమార్,జయ,ఇస్మాయిల్ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోదాడలో డాక్టర్ గడల శ్రీనివాసరావు పర్యటన

## ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహకాల్లో జనసేన నాయకులు

## జనసేన యువ నాయకుడు కందికొండ సుమంత్



**స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా సెప్టెంబర్ / 11**

వరంగల్--ఖమ్మం--నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల (పీజీ) ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్న మాజీ ప్రజారోగ్య సంచాలకులు (డీహెచ్) డాక్టర్ గడల శ్రీనివాసరావు కోదాడ పట్టణంలో పర్యటించారు.కరోనా సమయంలో రాష్ట్ర హెల్త్ డైరెక్టర్‌గా విశేష సేవలందించిన ఆయన, ఎన్నికల ప్రచార సన్నాహకాల్లో భాగంగా పట్టణానికి రాగా పార్టీ శ్రేణులు స్వాగతం పలికాయి.ఈ సందర్భంగా కోదాడ నాయకులతో సమావేశమై రాబోయే ఎన్నికల వ్యూహాలు,ప్రచార సరళిపై చర్చించారు.ఈ కార్యక్రమంలో జనసేన యువ నాయకుడు కందికొండ సుమంత్,పసుపులేటి రామారావు,మోలుగురి సైదులు,మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తానేరు మురళి, శెట్టి సూర్యప్రకాష్,రాయల సతీష్,బాడే అంజి,సందీప్, గోపి,శ్రీను,మున్నూరు కాపు గుడిబండ గ్రామ శాఖ అధ్యక్షుడు కందికొండ నరసయ్య, మున్సిపల్ అభ్యర్థులు,తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వర్ణసాగరం



# శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలు

## పాఠశాల ప్రిన్సిపల్ పోసాని వెంకటరమణ



స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా సెప్టెంబర్ / 11

హుజూర్ నగర్ పట్టణ శ్రీ చైతన్య పాఠశాలలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ముందస్తు వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించి విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ పోసాని వెంకటరమణ మాట్లాడుతూ... భారతీయ సంస్కృతి,సంప్రదాయాలు, పండుగల విశిష్టతను భావితరాలకు తెలియజేయడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని చెప్పారు.వినాయకుడి పూజ ద్వారా విద్యార్థులలో ఏకాగ్రత,క్రమశిక్షణ, సద్భావన అలవడుతాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్కూల్‌లో టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు పలు రికార్డుల పరిశీలన

మనుబోలు, స్వర్ణ సాగరం :



పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పనితీరును మెరుగుపరిచే లక్ష్యంతో డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ 'డైట్' అధ్యాపకుల ఉమ్మడి బృందం శుక్రవారం మండలంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో భాగంగా మండలంలోని జడ్పీ బాయ్స్ హైస్కూల్‌ను టాస్క్ ఫోర్స్ బృందం పరిశీలించింది ఈ సందర్భంగా డిప్యూటీ డి ఓ సనత్ కుమార్ మాట్లాడుతూ.., పాఠశాలల పురోగతిని సమీక్షించడంతో పాటు లోపాలను సరిదిద్ది సరైన మార్గదర్శకత్వం చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. అంతేకాకుండా విద్యార్థులు,ఉపాధ్యాయుల రోజువారీ హాజరు శాతాన్ని పరిశీలించి తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనా విధానాలు, విద్యార్థులకు అందే విద్య నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించటం అలాగే రాబోయే మార్చి 2027 పదో తరగతి వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యార్థులను సన్నద్ధం చేసే చర్యలపై ఉపాధ్యాయులతో చర్చించి ప్రస్తుత ప్రణాళికల్లో చేయాల్సిన మార్పులు, చేర్పులపై దిశానిర్దేశం చేయటం,యు-డైస్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగం, సైన్స్ ల్యాబ్‌ల నిర్వహణ, 'క్లిక్కర్స్' వంటి ఆధునిక పరికరాల పనితీరును మా బృందం పరిశీలించింది.పాఠశాలకు అక్షయ పాత్ర సెంట్రల్ కిచెన్ ద్వారా సరఫరా అవుతున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తనిఖీచేసాము. విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత, పరిశుభ్రత పాటించాలని, కూరలు రుచికరంగా ఉండేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.పాఠశాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను, లోపాలను అధిగమించేందుకు ఉపాధ్యాయులకు రెమిడియల్ సూచనలు ఇచ్చి వారిలో ప్రేరణ నింపేందుకు ఈ చర్యలు ఉపయోగపడతాయని తెలిపారు. పాఠశాల పనితీరును మెరుగుపరిచి, సమాజంలో ప్రభుత్వ పాఠశాలలపై మంచి నమ్మకాన్ని కలిగించడమే తమ ధ్యేయమని టాస్క్ ఫోర్స్ టీమ్ పేర్కొంది. ఈ తనిఖీల్లో కె.శ్రీనివాసులు, ముతహార సుల్తానా, జి.హజరత్తయ్య, పి. అమూల్య కుమారి పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో నేడు జాతీయ లోక్ అదాలత్

## కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి -- 12వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి



స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్


శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి కోర్టు ఆవరణంలో ఈ నెల 12వ తేదీన రెండవ శనివారం సందర్భంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు లోక్ అదాలత్ చైర్మన్, 12వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి తెలిపారు.జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా క్రిమినల్ కేసులు, మ్యాట్రిమోనియల్ కేసులు, పెట్టి కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులు తదితర వివాదాలను ఇరుపక్షాల కక్షిదారులను పిలిపించి రాజీ మార్గంలో పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా కేసులను సత్వరంగా, సౌహార్దపూర్వకంగా పరిష్కరించుకోవచ్చని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పట్టణ ప్రజలతో పాటు న్యాయవాదులు, బీఎస్ఎన్ఎల్, పోలీస్ శాఖ, బ్యాంకులు తదితర సంస్థలు జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకుని తమకు సంబంధించిన కేసులు, వివాదాలను పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి సూచించారు.

# ఘనంగా ఎంపీ మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు

స్వర్ణసాగరం బుచ్చినాయుడు కండ్రిగ



మండల కేంద్రలో రాజంపేట పార్లమెంట్ సభ్యులు పి.వి. మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య అత్యంత వైభవంగా జరిగాయి,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ నూకతోటి రాజేష్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి, ఎంపీ మిథున్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఎంపీ మిథున్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో అనేకమంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం మండల కేంద్రంలో సుమారు 500 మంది పేదలకు, ప్రజలకు భారీగా బిర్యానీ పంపిణీ అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. తమ ప్రియతమ నేత పుట్టినరోజున ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలోవైఎస్ఆర్సిపి పార్టీ మండల అధ్యక్షుడు మణి నాయుడు, గోపాల్ రెడ్డి, అజయ్ రెడ్డి, ఆలత్తూరు ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ యూత్ కిరణ్ యాదవ్, రాజశేఖర్, ఆనంద్, సురేష్, వెంకటేష్ మరియు పెద్ద సంఖ్యలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు..




# తలారుల తీరుపై తలెత్తుతున్న ప్రశ్నలు!

## ప్రభుత్వ భూముల పరిరక్షణ ఎక్కడ..?

## విధుల నిర్వహణపై పర్యవేక్షణ ఏదీ..?

ఓజిలి (స్వర్ణ-సాగరం) సెప్టెంబర్ 11:

ఓజిలి మండలంలోని కొందరు తలారుల విధుల నిర్వహణపై ప్రజల్లో అనేక అనుమానాలు, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్థాయిలో ప్రభుత్వ భూములు, రెవెన్యూ రికార్డుల పరిరక్షణలో కీలక బాధ్యతలు నిర్వహించాల్సిన సిబ్బంది పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ అవసరమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు, ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతు న్నారు.

**ప్రభుత్వ భూములపై కన్నెందుకు పడుతోంది..?...** మండలంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ భూములపై ఆక్రమణలకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే సంబంధిత స్థాయిలో వాటిని గుర్తించి అడ్డుకోవాల్సిన వ్యవస్థ ఎంతవరకు సమర్థవంతంగా పనిచేస్తోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డులు, సర్వే నంబర్లు, భౌతిక పరిస్థితులను అధికారులు స్వయంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

**కార్యాలయానికి సమయానికి రాకపోతే ప్రజల పరిస్థితి ఏంటి?...**తలారులు నిర్ణీత సమ యంలో విధులకు హాజరు కాకపోవడం, ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం వల్ల రెవెన్యూ సంబంధిత పనుల కోసం వచ్చే గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఒకవైపు చిన్నచిన్న రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతుండగా, మరోవైపు క్షేత్రస్థాయి సిబ్బంది అందుబాటులో లేకపోవడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**విధులా..? వ్యక్తిగత వ్యాపారాలా..?...**కొంతమంది తలారులు తమ ప్రభుత్వ విధులపై పూ ర్తి స్థాయిలో దృష్టి పెట్టకుండా పట్టణ ప్రాంతాల్లో ఇతర వ్యాపార కార్యకలాపాలు నిర్వహి స్తు న్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అంతేకాకుండా వారి జీవనశైలి, ఖరీదైన వాహ నా ల వినియోగంపై కూడా ప్రజల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎం త ఉందోసంబంధితఅధికారులు అధికారికంగా పరిశీలించి స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

**ఉన్నతాధికారులు స్పందిస్తారా..? విచారణ ఎప్పుడు?...**ప్రభుత్వ భూముల పరిరక్షణ, రెవెన్యూ రికార్డుల సంరక్షణ, ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర కీలకం.అలాంటి సిబ్బందిపై విధుల పట్ల నిర్లక్ష్యం, ప్రభుత్వ భూముల విషయంలో అలసత్వం,అనధికార కార్యకలాపాలకు సహకారం వంటి ఆరోపణలు వస్తే వాటిని సాధారణంగా తీసుకోకుండా తహసీల్దార్ స్థాయి నుంచి ఉన్నత రెవెన్యూ అధికారులు వరకు వాస్తవ నిర్ధారణ చేయాల్సిన అవసరం ఉంది.ఆరోపణలు నిజమైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.ఆరోపణల్లో వాస్తవం లేకపోతే అదే విషయాన్ని అధికారికంగా వెల్లడించి సంబంధిత సిబ్బందిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలి. ప్రభుత్వ భూమి ఒక్క గజం కూడా అన్యాక్రాంతం కాకుండా చూడటం అధికార యంత్రాంగం బాధ్యత. విధుల పట్ల నిర్లక్ష్యం చేసినా, అధికార బాధ్యతలను దుర్వినియోగం చేసినా ఎవరు అయినా నిబంధనల ప్రకారం సమాధానం చెప్పాల్సిందే.

# పెన్షన్ దరఖాస్తు గడువును వెంటనే పొడిగించాలి

## - ఏఎంసి డైరెక్టర్ బోలా శీను

మనుబోలు, స్వర్ణసాగరం:



సర్వర్ల బిజీ, సాంకేతిక సమస్యలు, సిబ్బంది కొరత కారణంగా అర్హులైన పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏఎంసి డైరెక్టర్ బోలా శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనల ప్రకారం 60 ఏళ్లు దాటి, తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి పేదవాడూ వృద్ధాప్య పెన్షన్‌కు అర్హుడే. అలాంటప్పుడు దరఖాస్తుల్లో క్యాస్ట్ (కుల) సర్టిఫికెట్ అని నిబంధన పెట్టడం ఏంటి ఆకలికి, వయసుపైబడిన నిస్సహాయతకు కులంతో పనేముంది అని ప్రశ్నించారు.

వితంతు పెన్షన్ కోసం భర్త డెత్ సర్టిఫికెట్, దివ్యాంగుల పెన్షన్ కోసం సదరం సర్టిఫికెట్ అడగడం సబబే అని, కానీ వృద్ధాప్య పెన్షన్లకు కుల ధ్రువీకరణ పత్రాలు అడగడం వల్ల అవ్వాతాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చేతి కర్రల సాయంతో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, సర్టిఫికెట్ల కోసం సచివాలయాలు, ఎంఆర్ఓ ఆఫీసులు, మీ-సేవా కేంద్రాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూ క్యూలలో నిల బడాల్సి వస్తోందన్నారు.మరోపక్క దరఖాస్తు చేసుకోవడానికి కేవలం వారం రోజులే గడువు ఇవ్వడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఇంత తక్కువ సమయంలో అందరికీ క్యాస్ట్ సర్టిఫికెట్లు రావడం అసాధ్యం. ఒకవైపు సైట్లు పనిచేయక, సర్వర్లు డౌన్ అయి దరఖాస్తుదారులు అల్లాడుతుంటే.. మరోవైపు మధ్యలో దళారుల దోపిడీ ఎక్కువైంది" అని మండిపడ్డారు.కూటమి ప్రభుత్వంలో పెన్షన్ అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలని, ఈ ప్రక్రియలో అధికారులు ఓర్పు, సహనం, సమన్వయంతో పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పేదలకు ఆసరాగా ఉండాల్సిన పెన్షన్ పథకం, సర్టిఫికెట్ల పేరుతో వారికి శిక్షగా మారకూడదని హితవు పలికారు. తెల్ల రేషన్ కార్డు, వయస్సు నిర్ధారణ ఆధారాలు ఉంటే చాలు.. వెంటనే క్యాస్ట్ సర్టిఫికెట్ నిబంధనను తొలగించాలి. సాంకేతిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని, అర్హులందరూ దరఖాస్తు చేసుకునేలా వెంటనే గడువు తేదీని పొడి గించాలి .వృద్ధులు, పేదల సమస్యలపై అధికారులు, ప్రజాప్ర తినిధు లు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# శ్రీకాళహస్తిలో పోషకాహార విప్లవం



స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

పోషకాహార లోపాలను రూపుమాపి, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలనే ఆశయంతో, శ్రీకాళహస్తి ప్రాజెక్టు ఐసిడిఎస్ పరిధిలో "పోషణ్ మా -- 2026" కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. శ్రీకాళహస్తి పట్టణం, ముత్యాలమ్మ గుడి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం, సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు నెల రోజుల పాటు కొనసాగే పోషణ్ మా సెలెబ్రేషన్స్‌కు నాంది పలికింది.ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం, సమాజంలో పోషకాహారం పట్ల అవగాహన కల్పించడం, తద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం. ఈ నెల రోజుల పాటు జరిగే వేడుకలలో అనేక థీమ్‌లు చర్చించబడతాయి,

వాటిలో కొన్ని:

వివిధ భరిత పోషకాహారం: సమతుల్య ఆహారం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పడం.

అంగన్‌వాడీలో వేడిగా వండిన భోజనం: అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారం యొక్క నాణ్యత, ప్రాముఖ్యతను వివరించడం.

సమాజ భాగస్వామ్యం, బాధ్యతాయుతం: పోషకాహార లోపాలను నివారించడంలో సమాజం యొక్క పాత్రను హైలైట్ చేయడం.

పోషణ, ప్రాథమిక విద్య, బాలల వికాసం: పోషకాహారం, విద్య, పిల్లల సమగ్ర అభివృద్ధి మధ్య ఉన్న సంబంధాన్ని వివరించడం.

మాతృ సంరక్షణ: గర్భిణులు, పాలిచ్చే తల్లుల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించడం.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీకాళహస్తి సిడిపిఓ శాంతి దుర్గ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సిడిపిఓ శాంతి దుర్గ మాట్లాడుతూ, పోషకాహార లోపాలు, వాటి నివారణ, వివిధ ఆహార వర్గాల గురించి తల్లులు, పిల్లలు, ప్రజలకు అవగాహన కల్పించారు. వివిధ ఆహార వర్గాలను సమతుల్యంగా తీసుకోవడం ద్వారా పోషకాహార లోపాలను సమర్థవంతంగా నివారించవచ్చని ఆమె వివరించారు.ముత్యాలమ్మ గుడి వీధి అంగన్‌వాడీ వర్కర్లు, తల్లులు, చిన్నారులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, పోషకాహారం పట్ల తమ ఆసక్తిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో పోషకాహారం పట్ల అవగాహన పెరిగి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి ప్రజలు ప్రేరణ పొందుతారని ఆశిస్తున్నాము. "పోషణ్ మా -- 2026" కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు, ఇది ఆరోగ్యకరమైన, సంపన్నమైన భవిష్యత్తుకు పునాది వేసే ఒక ఉద్యమం.

# డీఎస్సీపై అసత్య ప్రచారం మానుకోవాలి

## డా. యం. ఉమేష్ రావు



స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి: అధికార వ్యామోహంతో ప్రత్యర్థులపై అసత్య ఆరోపణలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. యం. ఉమేష్ రావు ఆరోపించారు.ఎన్డీయే కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఎంతో శ్రమించి పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన అభ్యర్థుల ప్రతిభను అవమానించేలా జగన్ రెడ్డి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. తన పాలన కాలంలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుతం డీఎస్సీ నియామకాలపై ఆరోపణలు చేయడం విడ్డూరమని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం సుమారు 15,941 ఉపాధ్యాయ ఖాళీలను పారదర్శకంగా భర్తీ చేసిందని తెలిపారు.డీఎస్సీ పరీక్షల నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలు పాటించామని, టీసీఎస్ ఐయాన్ సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు 154 కేంద్రాల్లో పకడ్బందీగా నిర్వహించారని చెప్పారు. నిపుణుల ద్వారా రూపొందించిన వేలాది ప్రశ్నల నుంచి పరీక్షలు నిర్వహించి, నియామక ప్రక్రియను రికార్డు స్థాయిలో పూర్తి చేశారని పేర్కొన్నారు. సుమారు 16 వేల కుటుంబాల్లో ఉపాధి వెలుగులు నింపిన ఘనత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కే దక్కుతుందని కొనియాడారు.కేవలం 148 రోజుల్లోనే డీఎస్సీ నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేసినట్లు తెలిపారు. నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపణలు చేస్తున్నవారు అందుకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని సవాలు చేశారు. ప్రభుత్వం అవసరమైతే నిబంధనల ప్రకారం విచారణకు సిద్ధంగా ఉందని, అయితే ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం తగదని అన్నారు.తన ప్రభుత్వ కాలంలో జారీ చేసిన జీవో నెం. 77 ప్రకారం అమలవుతున్న హారిజాంటల్ రిజర్వేషన్ విధానాన్ని ఇప్పుడు జగన్ రెడ్డి వ్యతిరేకించడం ఆశ్చర్యకరమని విమర్శించారు. విద్యా రంగ అభివృద్ధికి నారా లోకేష్ కట్టుబడి ఉన్నారని, వచ్చే ఐదేళ్లలో మరో 30 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించడం శుభపరిణామమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, నాయకులు గంగనపల్లి రమేష్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

swarna sagaram_Swarna sagaram.qxd 9/11/2026 10:05 PM Page 3



స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక
RNI No: APTEL/2020/15905



# సత్యవేడు మండల ప్రజలకు జీవితాంతం ఋణపడి ఉంటాను..!

## జడ్పీటీసి సత్యవేడు.

స్వర్ణ సాగరం, సత్యవేడు.

తిరుపతి జిల్లా సత్యవేడు మండల జడ్పిటిసి నేడు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్తులో జెడ్పీ సిఇఓ రవికుమార్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్తు చైర్మన్ జి. శ్రీనివాసులు అధ్యక్షతన జెడ్పీటీసిలను ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా సత్యవేడు జెడ్పీటీసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులుగా ప్రజా ప్రతినిధిగా 5 ఏళ్ల ప్రస్థానం చాలా సంతృప్తికరంగా సాగిందని తనను జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులుగా ఎన్నుకున్న సత్యవేడు మండల ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు, ప్రజా జీవితంలో అడుగు పెట్టి, ప్రజాప్రతినిధిగా ఎన్నికై జిల్లా స్థాయి సంఘం సభ్యులుగా నియమించబడి నేటికి 5 సంవత్సరాలు, ఈ 5 సంవత్సరాల కాలంలో మా సత్యవేడు మండల ప్రజల సంక్షేమం కొరకు అనేక సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం, అధికారుల సహకారంతో చాలా సమస్యలను



పరిష్కరించాం అలాగే మండల అభివృద్ధి కొరకు జిల్లా పరిషత్ నుంచి సాధ్యమైనంత వరకు నిధులు మంజూరు చేసుకొచ్చి గ్రామాలలో డ్రైనేజీలను సి.సి రోడ్లు త్రాగు నీటికి సంబంధించి బోర్లు వాటికి సంబంధించిన పైపులైన్ నిర్మాణాలు అలాగే సత్యవేడు పట్టణంలో జిల్లా పరిషత్ అతిథి భవనం పునరుద్ధరణ మరియు పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ సబ్ డివిజన్ కార్యాలయ మరమ్మతులకు నిధులు, రూరల్ వాటర్ సప్లై (=ఔూ) సబ్ డివిజన్ ఇంజనీరింగ్ కార్యాలయ మరమ్మతులుకు నిధులను మంజూ రు చేసుకొచ్చి అభివృద్ధికి కృషి చేశామని, అంతేకాకుండా ఎన్నో సమస్యలను జిల్లా పరిషత్ సమావేశంలోను మరియు జిల్లా స్టాండింగ్ కమిటీలో చర్చించి పరిష్కారానికి జిల్లా పరిషత్ చైర్మన్ వాసన్న మరియు జడ్పీ సిఇఓ రవికుమార్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం జరిగిందని దీనికి సత్యవేడు మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు, అనంతరం విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డిని చైర్మన్ మరియు జెడ్పీ సీఈఓ సంయుక్తంగా ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు మరియు జిల్లా పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితికి వీధిలైట్లు సరిచేయాలి

## ఎంపీడీవోకు బీజేపీ నాయకుల వినతి



స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ

మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వీధిలైట్ల సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ బీజేపీ మాజీ మండల అధ్యక్షులు హరిబాబు రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శరవణ్ కుమార్ శుక్రవారం ఎంపీడీవో వెంకటరత్నమ్మకు అర్జీ సమర్పించారు. గ్రామాల్లో పండుగ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనిచేయని వీధిలైట్లను వెంటనే మరమ్మతులు చేయించి వెలుగులు ఏర్పాటు చేయాలని వారు కోరారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో వెంకటరత్నమ్మ సమస్యను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# అక్షర పాఠశాలలో ముందస్తు వినాయక చవితి సంబరాలు



స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ

మండల కేంద్రంలోని అక్షర పబ్లిక్ పాఠశాలలో కరస్పాండెంట్ ప్రతాప్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు వినాయక చవితి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. హిందూ మతములో ముఖ్యమైన పండగ, ప్రతి ఒక్కరూ అతి ఉత్సాహంతో గంతులు వేస్తూ ఎగురుతూ, ఆనందాన్ని కలుగజేయు పండుగని ఈ సందర్భంగా విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పద్మశ్రీ సర్విశెట్టి ఎంతో మందికి ఆదర్శం

## -- మహిళా కళాశాల కార్యదర్శి నూలి శ్రీనివాస్



**నరసాపురం:**–మహిళల ఉద్ధరణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి పద్మశ్రీ అద్దేపల్లి సర్విశెట్టి అందరికీ ఆదర్శనీయుడని మహిళా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక బిజిబిఎస్ ఉమెన్స్ కళాశాలలో సర్విశెట్టి 121వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల అధ్యక్షుడు నూలి రమణమూర్తి సర్విశెట్టి సేవలను కొనియాడుతూ మాట్లాడారు. విద్యార్థినులు మారుతున్న కాలానికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలందించిన, కళాశాలలో పనిచేసి పదవీ విరమణ పొందిన కె.సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు, మాజీ ప్రిన్సిపాల్, మేజర్ నీరజ, కళాశాలలో పనిచేసి మృతి చెందిన కందాలం సూర్యనారాయణ దేహాన్ని మెడికల్ కళాశాలకు అవయవ దానం ఇచ్చిన ఆయన సతీమణి లక్ష్మి,వారితో పాటు పాత్రికేయ రంగం నుంచి విశిష్ట సేవలు అందించిన నరసాపురం ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు తరపట్ల ఇజ్రాయిల్ ను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపకార వేతనాలు, బహుమతులు అందజేశారు. సిబ్బందికి నూతన వస్త్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధ, సిబ్బంది, రోజా, మాధురి, సునీత, మంజు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# రాత్రివేళల్లో విద్యుత్ కోతలు.. ప్రజలకు అవస్థలు.

వరదయ్య పాలెం స్వర్ణ సాగరం సెప్టెంబర్ 11




సత్యవేడు, వరదయ్యపాళెం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో ప్రతి రోజు రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో తరచూ విద్యుత్ కోతలు విధించడంతో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఉక్కపోత, దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు రాత్రివేళల్లో చదువుకోవడానికి కూడా ఆటంకం కలుగుతోందని తెలిపారు. అత్యవసర సమయాల్లో విద్యుత్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు మరింత ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.ప్రతి రోజు రాత్రివేళల్లో విద్యుత్ అంతరాయాలు ఎందుకు ఏర్పడుతున్నాయో అధికారులు పరిశీలించి, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# 'కురుడుమల గణపతి వైభవం' షార్ట్ ఫిలిం తీసిన దండికుప్పం యువకుడు



శాంతిపురం స్వర్ణ సాగరం న్యూస్

శాంతిపురం మండలం దండి కుప్పం గ్రామానికి చెందిన ఖ వా ప్రవీణ్ ~ాx ఉపయోగించి కురుడుమల గణపతి వైభవం అనే షార్ట్ ఫిలిం ని తీసినట్టు తెలియజేశారు. ఈ సందర్భంగా కురుడుమల లోని మహా గణపతి దేవాలయం లో ఈ షార్ట్ ఫిలిం విడుదల పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఈ షార్ట్ ఫిలిం ను వినాయక చవితి సందర్భంగా గ్రేట్ సిగ్నేచర్స్ యూట్యూబ్ చానెల్ లో శనివారం ఉదయం 8 గంటలకు విడుదల చేస్తున్నట్లు దర్శకుడు ఖ వా ప్రవీణ్ తెలియజేశారు. ఈ షార్ట్ ఫిలిం ని ప్రేక్షకులు అందరూ గ్రేట్ సిగ్నేచర్స్ యూట్యూబ్ ఛానల్ లో ఉచితంగా వీక్షించి ఆదరించాలని కోరారు.

# రోడ్డు ప్రమాదాలు నివారించడమే నా లక్ష్యం

స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ;



తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో ప్రమాదాలకు కారణమవుతున్న ఇసుక ట్రాక్టర్లపై శుక్రవారం ఎస్సై హరిప్రసాద్ ఉక్కుపాదం మోపారు. మండలంలో ప్రతి ట్రాక్టర్‌ను నిలిపివేసి పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనేక వాహనాలకు కనీస ఫిట్‌నెస్ లేకపోవడం, ఆర్సీ, ఇన్సూరెన్స్ వంటి పత్రాలు లేకపోవడాన్ని గుర్తించారు. వీటన్నింటికీ మించి కొందరు డ్రైవర్లు మద్యం సేవించి, పెద్ద టేప్ రికార్డులు శబ్దాలతో, అతి వేగంగా మరియు నిర్లక్ష్యంగా నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు తేలింది. ఇలాంటి నిబంధనల ఉల్లంఘనులపై ఎస్ఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కఠిన చర్యలు చేపట్టారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అన్ని పత్రాలు ఉంటేనే వాహనాలను రోడ్డెక్కించాలని, లేదంటే కఠిన కేసులు తీవ్రంగా విధిస్తామని హెచ్చరించారు.

# స్వామి వివేకానంద జీవితం ఆదర్శం

## -- డాక్టర్ వాడ్రేవు సుందర్ రావు



**నర్సాపురం ;**–భారతీయ జనతా యువ మోర్చా పశ్చిమ గోదావరి జిల్లా ఆధ్వర్యంలో యూనివర్సల్ బ్రదర్హుడ్ ను పురస్కరించుకుని స్వర్ణాంధ్ర కళాశాలలో శుక్రవారం సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో డాక్టర్ వా డ్రెవుసుందరా రావు మాట్లాడుతూస్వామి వివేకానంద చికాగోలో ఇచ్చిన ప్రసంగం ప్రపంచ దేశాలకు సనాతన ధర్మం యొక్క ఔన్నత్యం, విలువలు ప్రపంచానికి పరిచయం అయ్యాయన్నారు.స్వామీజీ జీవితం ఆయన బోధనలు యువతకి స్ఫూర్తి దాయకం అని ఆయన జీవితం లో జరిగిన విషయాలు ఆయన సందేశాలు గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా అధ్యక్షులు పత్స గోపాలకృష్ణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పులపర్తి వెంకటేశ్వర రావు ముఖ్య వక్తలుగా రామకృష్ణ మిషన్ నుంచి దేశ విదేశాల్లో 4000 కు పైగా ఉపన్యాసాలు ఇచిన డా.వాడ్రేవు సుందరరావు ఆర్ ఎస్ ఎస్ ఖండ కార్యకారిణి ఏమ్. మురళీ కృష్ణ, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దానయ్య, నర్సాపురం బీజేపీ, యువ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

# స్వామివారి నిత్య అన్నదానం కి బియ్యం కూరగాయలు విరాళం

## విరాళం దాతలు సోమశేఖర్ రెడ్డి మిత్ర బృందం ఐరాల మండలం

కాణిపాకం, స్వర్ణ సాగరం సెప్టెంబర్ 11:



కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం నిత్యాన్నదానానికి 60 బస్తాల ఒకటిన్నర టన్ను బియ్యం మరియు 500 కిలోల వివిధ రకాల కూరగాయలు విరాళం,దాత సోమశేఖర్ రెడ్డి వారి మిత్రబృందం ఐరాల మండలం, పాలకల రెడ్డివారిపల్లె వాస్తవ్యులు, ఈ కార్యక్రమంలో అన్నదానం ఏఈఓ హరి మాధవరెడ్డి, సూపర్డెంట్ కోదండపాణి, తదితరులు ఉన్నారు.

# జర్నలిస్ట్ పూర్ణచందర్ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



స్వర్ణ సాగరం ఆగస్టు 11 కూరవి:

సీనియర్ జర్నలిస్టు పూర్ణచందర్ తండ్రి అనుగోజు కోటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న కూరవి మండల కాంగ్రెస్ నాయకులు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బైరావుని పల్లి గ్రామానికి వెళ్లి పూర్ణచందర్ కుటుంబాన్ని పరామర్శించి కోటయ్య మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోటయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో కురవి మండల అధ్యక్షులు బాలాగాని శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పిటిసి మాజీ మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం గౌడ్, ఆలయ చైర్మన్ కోర్ని రవీందర్ రెడ్డి, జిల్లా ఎస్సి,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు గొల్లపల్లి రజినీకాంత్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, మాజీ ఒడిసిమ్ఎస్ చైర్మన్,జిల్లా కార్యదర్శి నూకల వేణుగోపాల్ రెడ్డి, మాజీ జడ్పిటీసి జిల్లా కార్యదర్శి బాధవత్ రాము నాయక్, నేరడ గ్రామ పార్టీ అధ్యక్షులు మాదూరి రఘు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ ఇళ్ల పట్టాలపై సమగ్ర విచారణ జరపాలి

## TIDCO సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు, చేయాలి

## ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు జనసేన పార్టీ అభ్యర్థులు వినతి

స్వర్ణసాగరం గూడూరు (సెప్టెంబర్ 11)

గూడూరు నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలపై గూడూరు జనసేన పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి తీగల చంద్రశేఖర రావు, శుక్రవారం ఎంపిడీఓ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో గూడూరు శాసన సభ్యులు శ్రీ పాశం సునీల్ కుమార్ కు వినతి పత్రం అందచేశారు.దీనిలో ప్రధానంగా గూడూరు పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ప్రాంతంలోని సర్వే నంబర్లు 2035, 2038, 2039కు సంబంధించిన ప్రభుత్వ భూములు, పేదలు కళాకారులకు కేటాయించిన ఇళ్ల స్థలాల విషయంలో ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలించాలని,కళాకారులకు కేటాయించిన ఇళ్ల స్థలాలు ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి, కేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా ఏమైనా బదలాయింపులు లేదా విక్రయాలు జరిగాయ అన్న విషయం పై విచారణ జరపాలని, పేదలకు కేటాయించిన భూముల్లో ఆక్రమణలు జరిగాయా అనే అంశాలను రెవెన్యూ రికార్డులు క్షేత్రస్థాయి పరిశీలన అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే TIDCO భవనాల్లో నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొం టున్న తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం,పాముల బెడద సమస్యలను కూడా పరిష్కారం చూపాలని కోరారు.



**TIDCO భవన ప్రాంతంలో పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలి**

TIDCO ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఇళ్లను కొంతమంది అపరచిత వ్యక్తులు ఉప యోగిస్తున్నారని ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు కుటుంబాల భద్రతను దృష్టి లో ఉంచుకుని TIDCO ప్రాంతంలో పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని, పగలు రాత్రి పోలీస్ గస్తీని పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

**సమస్య పై స్పందించిన ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**

జనసేన పార్టీ సమర్పించిన వినతి పత్రంలోని సమస్యలపై ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ గారు తక్షణమే స్పందిచి ౧×ణజూ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా మున్సిపల్ కమిషనర్‌తో పాటు రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ సంప్రదిపులు జరిపి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుకు నవీన్ కుమార్, సుభాన్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

### జిల్లా ఎస్పీ శ్రీ తుషార్ డూడి ఐపీఎస్



**చిత్తూరు.స్వర్ణసాగరం. సెప్టెంబర్ 11**

ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులు,ట్రాఫిక్ చలాన్లు,సివిల్ వివాదాలను లోక్ అదాలత్ ద్వారా సులభతరంగా, త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడం వల్ల దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియకు దూరంగా ఉండటంతో పాటు సమయం, ఖర్చు ఆదా అవుతాయని ఎస్పీ పేర్కొన్నారు. ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో వివాదాలకు ముగింపు పలకడం ద్వారా స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.పెండింగ్‌లో ఉన్న రాజీపడే కేసులను పరిష్కరించుకోవాలనుకునే వారు సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి అవసరమైన వివరాలు తెలుసుకోవాలని సూచించారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమపై ఉన్న పెండింగ్ కేసులను చట్టపరమైన విధానంలో పరిష్కరించుకుని, వివాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి,ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

# నేడు డక్కిలి మండలంలో విద్యుత్ అంతరాయం

**స్వర్ణ సగరం డక్కిలి ( సెప్టెంబర్ 11)**



తిరుపతి జిల్లా డక్కిలి మండలంలో విద్యుత్ అంతరాయం. నేడు రెండొవ శనివారం (12.09. 2026) డక్కిలి మండలంలోని 33/11ఖజ సబ్‌స్టేషన్ల నందు మరమ్మత్తులు కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని డక్కిలి మండలం విద్యుత్ సహాయక ఇంజనీర్ బి. అశోక్ తెలియపరిచారు. కాబట్టి ప్రజలందరూ కూడా గృహ వినియోగ దృష్ట్యా నీటిని నిల్వ చేసుకోవాల్సిందిగా తెలియజేశారు.

# బ్యాంకు ఉద్యోగులు రోడ్డు ఎక్కడానికి కారణం మోడీ ప్రభుత్వ విధానాలే





**చిత్తూరు.స్వర్ణసాగరం. సెప్టెంబర్ 11**

బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఉదయం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద బ్యాంకు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్. నాగరాజా సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు వి.సి.గోపీనాథ్ మాట్లాడుతూ బ్యాంక్ ఉద్యోగులు వారి సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కినారు అంటే దీనికి పూర్తి బాధ్యత మోడీ ప్రభుత్వ విధానాలే తప్ప వేరే కాదన్నారు గతంలో ఏదైతే బ్యాంకు ఉద్యోగుల సంఘ నాయకుల చేత కేంద్ర ప్రభుత్వం సంబంధిత అధికారులు కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమలు చేయకపోవడంతో ఈరోజు బ్యాంకు ఉద్యోగులు రోడ్డుకు రావలసిన పరిస్థితి వచ్చిందన్నారు గతంలో జాతీయ ప్రభుత్వ బ్యాంకులు,ప్రైవేటు బ్యాంకులు ఎక్కువగా ఉండేదని బ్యాంకు సిబ్బంది ఎక్కువగా ఉండేవారని ప్రస్తుతం 33 బ్యాంకుల మాత్రమే ఉన్నాయని బ్యాంకు సిబ్బంది కూడా కుదించారని బ్యాంక్ ఉద్యోగులు కుదించడంతో పనిభారం ఒత్తిడి పెరిగి ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఏఐటియూసీ నాయకత్వంలో పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి చిత్తూరు నగర కార్యదర్శి దాసరి చంద్ర, కే.మణి,పి.రఘు,బాలాజీ రావు తదితరులు పాల్గొన్నారు

# పెన్షన్ దరఖాస్తుల గడువు పొడిగించాలి

### ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్



**స్వర్ణ సాగరం రామకుప్పం సెప్టెంబర్ 11**

కుప్పం నియోజకవర్గంలో నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే అర్హులైన పేదలు పలు సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు.ముఖ్యంగా హౌస్‌హోల్డింగ్ మ్యాపింగ్‌లో కుటుంబ సభ్యులు సరిగ్గా లింక్ కాకపోవడం, రైస్ కార్డు–హౌస్‌హోల్డింగ్ మ్యాపింగ్ జరగకపోవడం, ఓటర్ ఐడీకి సంబంధించిన బూత్ వివరాలు మారడం, ఒకే ఇంటి కుటుంబ సభ్యులు వేర్వేరు హౌస్‌హోల్డింగ్‌లలో చూపించడం, స్ప్లిటింగ్ సమస్యల వల్ల అర్హులైన వారి వివరాలు సిస్టమ్‌లో కనిపించకపోవడం వంటి సమస్యలతో దరఖాస్తులు చేసుకోలేకపోతున్నారని తెలిపారు.వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో ఈ సమస్య మరింత తీవ్రంగా మారిందని, గడువు ముగిస్తే సాంకేతిక కారణాలతో అర్హులైన పేదలు పెన్షన్‌కు దూరమయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.కాబట్టి ప్రభుత్వం పెన్షన్ దరఖాస్తుల గడువును మరికొన్ని రోజులు పొడిగించి, మ్యాపింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు.సాంకేతిక సమస్యలు పేదల సంక్షేమానికి అడ్డంకి కాకూడదు... అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కుప్పం కో ఇన్చార్జ్ పి వెంకటేష్ మాదిగ. మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ మాదిగ. ఎంఎస్పి కుప్పం సీనియర్ నాయకుడు గోవింద మాదిగ. రామకుప్పం మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ మాదిగ. రమేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర కళాశాలలో ఏపిసిటిఈ ఐడియా ల్యాబ్ ప్రారంభం

**నర్సాపురం:**-మండలంలోనిసీతారామపురంలో గల స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ లో విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణలు, పరిశోధనా దృక్పథం, ప్రోటోటైప్ అభివృద్ధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఏపిసిటిఈ -- ఐడియా ల్యాబ్ ను శుక్రవారం ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్వాంటమ్ మిషన్ మిషన్ డైరెక్టర్ సి వి శ్రీధర్ క్యాబిట్ ఫోర్స్ సీఈఓ యల్ వెంకట సుబ్రమణియం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు ఏపిసిటిఈ ఐడియా ల్యాబ్ ను సందర్శించి, ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన వివిధ సాంకేతిక సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల్లో ఆవిష్కరణలపై ఆసక్తిని పెంపొందించడంలో ఇలాంటి ఆధునిక ల్యాబ్‌లు కీలక పాత్ర పోషిస్తాయని వారు పేర్కొన్నారు.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న క్వాంటమ్ టెక్నాలజీ, డీప్‌టెక్, ఫోటానిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ అధునా తన తయారీ సాంకేతికతలలో విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్య అతిథులు





సూచించారు. విద్యార్థుల ఆలోచనలను పరిశోధన, ప్రోటోటైప్ ఉత్పత్తుల రూపంలోకి తీసుకురావడానికి ఐడియా ల్యాబ్ ఒక సమర్థవంతమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు.ఈ ల్యాబ్‌లో ఎలక్ట్రానిక్స్ & ఐఓటీ రోబోటిక్స్ & ఆటోమేషన్ మెకానికల్ ఫాబ్రికేషన్ , 3డి ప్రింటింగ్ & ప్రోటోటైపింగ్ , పీసీబీ డిజైన్ & డెవలప్మెంట్ తదితర రంగాల్లో ప్రయోగాత్మక ప్రాజెక్టులు చేపట్టేందుకు అవస రమైన సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి.విద్యార్థులు తమ ఆలోచనలను ఐడియాషన్ నుంచి డిజైన్ , ప్రోటోటైప్ నుంచి ప్రొడక్ట్, ప్రొడక్ట్ నుంచి స్టార్టప్ దిశగా అభివృద్ధి చేసుకునేలా ల్యాబ్‌ను వినియోగించుకోనున్నారు. వివిధ ఇంజనీరింగ్ విభాగాల విద్యార్థులు కలిసి ఇంటర్‌డిసిప్లినరీ ప్రాజెక్టులను రూపొందించేందుకు కూడా ఈ ల్యాబ్ దోహదపడుతుందని వారు తెలిపారు.ఈ సందర్భంగా చైర్మన్ కేవీ . సత్యనారాయణ, ట్రెజరర్ కే . వి స్వామి, డైరెక్టర్ ఏ . శ్రీహరి మాట్లాడుతూ, విద్యార్థులను కేవలం ఉద్యోగాలకు సిద్ధం చేయడమే కాకుండా ఆవిష్కర్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, పరిశ్రమకు అవసరమైన భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు.కళాశాల భవిష్యత్తులో మరిన్ని పరిశోధనా ప్రాజెక్టులు, పరిశ్రమలతో భాగస్వామ్యాలు, స్టార్టప్ కార్యక్రమాలు విద్యార్థుల ఇన్నోవేషన్ కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు ఐడియా ల్యాబ్ ను సమర్థవంతంగా వినియోగించుకోనుందని యాజమాన్యం తెలిపింది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఏపిసిటిఈ ఐడియా ల్యాబ్ చీఫ్ మెంటర్, కోఆర్డినేటర్, కో-కోఆర్డినేటర్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

# మట్టి విగ్రహాలను ప్రోత్సాహిద్దాం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను తరిమి కొడదాం











### పర్యావరణానికి ముప్పు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలు

### ప్రగతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల తయారీ అవగాహన ర్యాలీ

**స్వర్ణసాగరం కోట (సెప్టెంబర్ 11)**

మట్టి విగ్రహాలను ప్రోత్సాహిద్దాం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను తరిమి కొడదాం అనే నినాదం పై శ్రీ ప్రగతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు శుక్రవారం విద్యార్థులు మట్టి విగ్రహాల తయారీ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా మట్టితో వివిధ ఆకృతులలో విగ్రహాలను తయారు చేసి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.అనంతరం విద్యార్థులు మట్టి విగ్రహాలను చేతబట్టి కోట బజారులో ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా "మట్టి విగ్రహాలను ప్రోత్సహిద్దాం -- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం", "ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌కు దూరంగా ఉండి ప్రకృతిని కాపాడుకుందాం" వంటి నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. విద్యార్థులు వీధి వ్యాపారులకు మట్టి విగ్రహాలను అందజేసి మట్టి వినాయకుడిని పూజించమని విద్యార్థులు స్వయంగా చెప్పడం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పసుపులేటి కిషోర్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే పదార్థాల వినియోగాన్ని తగ్గించి, సహజసిద్ధమైన మట్టి విగ్రహాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చిన్న వయసు నుంచే విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందిస్తే, భవిష్యత్తులో వారు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని విద్యార్థులు స్వయంగా మట్టి విగ్రహాలను తయారు చేయడం ద్వారా సృజనాత్మకతతో పాటు పర్యావరణంపై బాధ్యతను కూడా నేర్చుకున్నారని అభినందనలు తెలియచేస్తున్నట్లు తెలిపారు. పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషిచేస్తున్న జలీల్ అహ్మద్

### కాలువల పూడికతీతకు మినీ జేసీబీ

### కోట పంచాయతీ అభివృద్ధికి మరో ముందడుగు

### కాలువల పూడికతీత, పైపుల ఏర్పాటు పై స్వయంగా పరిశీలన







**స్వర్ణసాగరం కోట (సెప్టెంబర్ 11)**

కోట పంచాయతీలో కాలువల పూడికతీత, పూడిక తొలగింపు, పైపుల ఏర్పాటు వంటి అత్యవసర పనులను వేగవంతంగా చేపట్టేందుకు మినీ జేసీబీని పంచాయతీ ఈవో కిరణ్ సహకారంతో కోట పంచాయతీ పరిధిలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను మరింత వేగంగా పూర్తి చేయడానికి జలీల్ అహ్మద్ చర్యలు తీసుకున్నారు. పంచాయతీలో పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో కాలువల పూడికతీత, పనులను చేపట్టేందుకు ఈమినీ జేసీబీ ఎంతగానో ఉపయోగపడనుందని పంచాయతీ ప్రజల అవసరాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడుతున్న జలీల్ అహ్మద్ కు కోట పంచాయతీ ప్రజలు కృతజ్ఞతలు తెలియచేసారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శంషుద్దీన్,గారి సురేష్,వెంకన్నపాలెం సర్పంచ్ కోళ్ల మధు యాదవ్, పంచాయతీ ఈవో కిరణ్, నియోజకవర్గ మైనార్టీ నాయకులు నౌషద్ భాష,టీడీపీమండల కోశాధికారి అక్బర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# స్వామివారి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

### గణేష్ దీక్ష హోమం మండపం ఏర్పాట్లు





**కాణిపాకం, సెప్టెంబర్ సెప్టెంబర్ 11 :**

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం 2026వ సంవత్సరం వార్షిక బ్రహ్మోత్సవాలకు వైభవంగా ఏర్పాట్లు పూర్తి, సంస్కృత కార్యక్రమాలకు ప్రత్యేక స్టేజ్, గణేష్ దీక్ష హోమ మండపం, అదనపు క్యూలైన్లు, స్వాగత ఆర్చిలు, తదితర ఏర్పాట్లు మొత్తం పూర్తి చేయడం జరిగింది. ఆలయ అధికారులు దగ్గరుండి ఏర్పాట్లు పరిశీలిస్తూ వేగవంతం చేస్తున్నారు

# జాతీయ కుష్టు నివారణ కార్యక్రమం

**బంగారుపాళెం.స్వర్ణ సాగరం.సెప్టెంబర్ 11**



చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల పరిధిలోని నలగాంపల్లి గ్రామ పంచాయతీ నందు జాతీయ కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా ఎల్సిడిసి ఇంటింటి సర్వే జరిగినది ఈ సర్వేలో నొప్పిలేని,స్పర్శలేని మచ్చలను గుర్తించి డాక్టర్ ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తారని డిపిఎమ్ఓ మని తెలిపారు ఏం డి టి మందుల ద్వారా ఈ చికిత్స నయం అవుతుందని ఎన్ ఎల్ ఈ పి నోడల్ పర్సన్ వైఎస్ఆర్ కృష్ణ తెలిపారు ఈ కార్యక్రమం 11-9- 26 నుండి 24 -9 -26 వరకు ఇంటింటా కుష్టు నివారణ సర్వే నిర్వహిస్తారని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని హరికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫార మెడికల్ ఆఫీసర్ మణి, ఎన్ ఎల్ ఈ పి మోడల్ పర్సన్ వై హరికృష్ణ, ఏఎన్ఎం నిర్మల, హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, సెల్వరాజ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# కరకంబాడి అమర రాజా విద్యాలయంలో ఘనంగా కథోత్సవ్--2026

### సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ఇతివృత్తంతో అంతర పాఠశాలల ఇంగ్లీష్ కథల పోటీలు

**రేణిగుంట స్వర్ణ సాగరం సెప్టెంబర్ 11**

గురువారం కరకంబాడిలోని అమర రాజా ఆడిటోరియంలో అమర రాజా విద్యాలయం ఆధ్వర్యంలో అంతర పాఠశాలల ఇంగ్లీష్ కథల పోటీ కథోత్సవ్--2026 అత్యంత వైభవంగా నిర్వహించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు ప్రధాన ఇతివృత్తంగా నిర్వహించిన ఈ పోటీలో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 17 ప్రముఖ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ కథా చెప్పే నైపుణ్యంతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ లాంగ్వేజ్-లిటరేచర్ ప్రొఫెసర్ డాక్టర్ పి. హరి పద్మ రాణి, అమర రాజా గ్రూప్ చీఫ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ ప్రశాంత్ తివారి, అమర రాజా ఎనర్జీ





మొబిలిటీ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా, న్యాయ నిర్ణేతలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, కథలు చెప్పడం ఒక అద్భుతమైన కళ అని, ఇది విద్యార్థుల్లో సృజనాత్మకత, ఊహాశక్తి, ఆత్మవిశ్వాసం, భావవ్యక్తీకరణ సామర్థ్యాలను పెంపొందించేందుకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. ప్రస్తుత ప్రపంచానికి ఎంతో కీలకమైన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను విద్యార్థులు కథల రూపంలో ఎంచుకుని, వాటిని సృజనాత్మకంగా ప్రదర్శించిన తీరు అభినందనీయమని ప్రశంసించారు. తీవ్ర పోటీ నడుమ సాగిన ఈ ఇంగ్లీష్ కథల పోటీలలో దిగువమాఘం అమర రాజా విద్యాలయం విద్యార్థిని బి. వైష్ణవి ప్రథమ బహుమతి సాధించగా, కరకంబాడి అమర రాజా విద్యాలయం విద్యార్థిని సి. దేవస హర్షిత ద్వితీయ బహుమతి, శ్రీసాయి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని సి. రూప్సి తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథులు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అమర రాజా విద్యాలయం ప్రిన్సిపాల్ గ్లోరి దేవ ప్రియ, వైస్ ప్రిన్సిపాల్ పూజ, ఉపాధ్యాయ బృందం, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కథోత్సవ్-- 2026 కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

swarna sagaram_Swarna sagaram.qxd 9/11/2026 10:05 PM Page 5



# మున్సిపల్ ఎన్నికలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులుతో సమావేశం

## మున్సిపల్ కమిషనర్ శ్రీధర్

కనిగిరి స్వర్ణ సాగరం సెప్టెంబర్ 11

కనిగిరి పట్టణంలో 32 వార్డులకు సంబంధించి 42 పోలింగ్ స్టేషన్ల జాబితా పారదర్శకంగా తయారు చేసినట్లు మునిసిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు. శుక్రవారం పురపాలకసంఘం కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పోలింగ్ బూత్ జాబితాలో మార్పులు, చేర్పులు ఇతర విషయాల గురించి చర్చించడం జరిగింది. అనంతరం పోలింగ్ బూత్ జాబితా విషయంలో పలు





సలహాలను వివిధ రాజకీయ పార్టీ తరపున కమీషనర్ దృష్టికి తీసుకుని వచ్చారు. అనంతరం కమీషనర్ శ్రీధర్ మాట్లాడుతూ పోలింగ్ బూత్ లకు సంబంధించి బిఎల్ఓ ల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయో లేదో తెలుసుకుని తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ మేనేజర్ పూర్ణిమ, ఆర్ఐ వెంకటేష్, టీపిబిఓ కృష్ణ, ప్లానింగ్ సెక్రటరీలు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు జరుపుకుందాం

## నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవు

## మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో పోలీస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి

## డీజేలకు ఎలాంటి అనుమతులు లేవు: పొదలకూరు సీఐ గుత్తి వెంకట్రావు

స్వర్ణ సాగరంపొదలకూరు, సెప్టెంబరు 11

వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని పొదలకూరు సీఐ గుత్తి వెంకట్రావు ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని సీఐ గుత్తి.వెంకట్రావు మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

**ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి...** వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందుగా పోలీస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సీఐ సూచించారు. మండపాల ఏర్పాటుకు సంబంధించి పోలీసు, విద్యుత్, అగ్నిమాపక శాఖల నుంచి అవసరమైన ముందస్తు అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. నిబంధనలను పాటించకుండా మండపాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా...**మండపాల ఏర్పాటులో




భద్రతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రోడ్ల మధ్యలో, వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించే ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు. అనుమతించిన స్థలాల్లోనే మండపాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

**విద్యుత్ భద్రతపై అప్రమత్తత...**మండపాల్లో విద్యుత్ అలంకరణల కోసం నాణ్యమైన వైరింగ్‌ను మాత్రమే వినియోగించాలని సూచించారు.అనధికార విద్యుత్ కనెక్షన్లు తీసుకోవడం వల్ల షార్ట్‌సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యుత్ శాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.ప్రస్తుతం వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండపాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాటర్‌ప్రూఫ్ పందిళ్లను ఏర్పాటు చేసుకోవడంతో పాటు, గాలికి తట్టుకునే విధంగా పటిష్ఠమైన ఫ్రేములను ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల వద్ద ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండేలా నిర్వాహకులు వాలంటీర్లను నియమించుకోవాలని తెలిపారు.

**డీజేలకు అనుమతి లేదు...**మండపాల వద్ద, నిమజ్జన ఊరేగింపుల సమయంలో డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని సీఐ గుత్తి వెంకట్రావు స్పష్టం చేశారు. లౌడ్‌స్పీకర్ల వినియోగంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. రాత్రి 10 గంటల తరువాత మైకులను నిలిపివేయాలని సూచించారు. శబ్దకాలుష్యం కారణంగా వృద్ధులు, విద్యార్థులు, రోగులు ఇబ్బందులు పడకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

**నిర్ణీత మార్గాల్లోనే నిమజ్జన ఊరేగింపు...**వినాయక విగ్రహాల నిమజ్జన ఊరేగింపును పోలీసుల సూచనల మేరకు నిర్ణీత మార్గాల్లోనే నిర్వహించాలని సీఐ సూచించారు. భారీ విగ్రహాలను తరలించే సమయంలో విద్యుత్ తీగల విషయంలో ప్రత్యేక అప్రమత్తత అవసరమన్నారు. అవసరమైన సందర్భాల్లో విద్యుత్ శాఖ సిబ్బంది సహకారం తీసుకోవాలని సూచించారు.వినాయక చవితి పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, పరస్పర సహకారంతో, ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ గుత్తి వెంకట్రావు ఆకాంక్షించారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, ఉత్సవ నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

# చెకుముకి సైన్స్ సంబరాల్లో సత్తా చాటిన అమరావతి స్కూల్

## మండల స్థాయిలో ప్రైవేటు పాఠశాలలో ప్రథమ ర్యాంక్

## ప్రభుత్వ పాఠశాలల్లో జడ్పీ బాయ్స్ హైస్కూల్ ఫస్ట్ ర్యాంక్



స్వర్ణ సాగరంపొదలకూరుసెప్టెంబర్11

పట్టణంలోని సాయిబాబా మందిరంలో గురువారం జన విజ్ఞాన వేదిక, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలు మండల స్థాయి పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీల్లో పొదలకూరు మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ పరీక్షల్లో ప్రైవేటు పాఠశాలల విభాగంలో అమరావతి స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మండల ప్రథమ ర్యాంకులను కైవసం చేసుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జడ్పీ బాయ్స్ హైస్కూల్, పొదలకూరు విద్యార్థులు ప్రథమ ర్యాంక్ సాధించి తమ సత్తా చాటారు.మండల ప్రథమ ర్యాంక్ సాధించిన అమరావతి స్కూల్ విద్యార్థులు10వ తరగతి వా. కావ్య శ్రీ సాయి,9వ తరగతి ౯. లక్ష్మీ తులసి,8వ తరగతి +. భువనేష్ మండల స్థాయిలో ప్రథమ ర్యాంకులు సాధించడం ద్వారా ఈ విద్యార్థులు సెప్టెంబర్ 27న జరగనున్న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఇది అమరావతి స్కూల్ విద్యా ప్రమాణాలకు, విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

# జెడ్పీటీసీ సభ్యులకు ఘన వీడ్కోలు

## కార్యక్రమంలో సుచిత్ర కన్నయ్య నాయుడు ని సన్మానించిన జడ్పీ చైర్మన్,సీఈవో





ఐరాల స్వర్ణ సాగరం , సెప్టెంబర్ 11:

ఐరాల మండలం జడ్పిటిసి డాక్టర్ వి.సుచిత్ర కన్నయ్య నాయుడు ని ఘనంగా సన్మానించిన జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, జడ్పీ సీఈవో రవి నాయుడు, తవణంపల్లి జడ్పిటిసి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ చైర్మన్ సభ్యురాలు భారతి మధు కుమార్.చిత్తూరు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం (జెడ్పీటీసీ) సభ్యుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, జెడ్పీ సీఈఓ ప్రకాష్ నాయుడు, తవణంపల్లి జెడ్పీటీసీ జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ చైర్మన్ సభ్యులు భారతి మధుకుమార్, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఐదేళ్ల పదవీకాలంలో ప్రజాప్రతినిధులుగా చేపట్టిన ప్రజాసేవా కార్యక్రమాలను సభ్యులు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. పరస్పరం తమ అనుభవాలు, అభిప్రాయాలను పంచుకుని ఒకరికొకరు అభినందనలు తెలిపారు.అనంతరం జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది జెడ్పీటీసీ సభ్యులను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నాయుడుపేటలో భారీ విగ్రహం.. ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

## నాయుడుపేటలో 'బాహుబలి' సెట్టింగ్.. భక్తుల చూపంతా అటువైపే!

## ఎవరూ చేయని రీతిలో భారీ విగ్రహం ఏర్పాటు..

## దగ్గరుండి ప్రతి ఏర్పాటును పర్యవేక్షిస్తున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పొట్లపూడి రాజేష్

నాయుడుపేట(స్వర్ణ-సాగరం) సెప్టెంబర్11:

నాయుడుపేట పట్టణంలో భక్తి వైభవం కొత్త శోభను సంతరించుకుంటోంది. తెలుగుదేశం పార్టీ నాయకుడు, ఎస్.జె. జ్యూలరీ అధినేత, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పొట్లపూడి రాజేష్ ఆధ్వర్యంలో నాయుడుపేటలో ఇప్పటివరకు ఎవరూ ఊహించని రీతిలో భారీ విగ్రహం, అద్భుతమైన సెట్టింగ్ ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. బాహుబలి సినిమాలోని భారీ సెట్టింగ్‌లను తలపించేలా రూపుదిద్దుకుంటున్న ఈ ఏర్పాట్లు పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

**భారీ విగ్రహం..కనువిందు చేసే సెట్టింగ్...** భక్తులకు ప్రత్యేక ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేలా భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. విగ్రహం చుట్టూ ఏర్పాటు చేస్తున్న విశాలమైన సెట్టింగ్, అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. నిర్మాణ పనులు పూర్తయ్యే కొద్దీ ఈ ప్రాంతం ఓ ప్రత్యేక ఉత్సవ ప్రాంగణాన్ని తలపించేలా మారుతోంది.

**రాజేష్ ప్రత్యేక శ్రద్ధ.. దగ్గరుండి పర్యవేక్షణ...** ఉత్సవ



కమిటీ అధ్యక్షుడు పొట్లపూడి రాజేష్ ఏర్పాట్లను కేవలం నిర్వహణ బృందానికి అప్పగించకుండా దగ్గరుండి ప్రతి అంశాన్ని పరిశీలి స్తున్నారు. భారీ సెట్టింగ్ నిర్మాణం, విగ్రహం ఏర్పాటు, అలంకరణలు, భక్తుల రాకపోకలకు అనుగుణంగా చేయాల్సిన ఏర్పాట్లపై నిర్వాహకులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తున్నారు. ఉత్సవాలు మరింత ఘనంగా, భక్తులకు గుర్తుండిపోయేలా నిర్వహించాలన్న లక్ష్యంతో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

**కులమతాలకు అతీతంగా.. భక్తుల సందడి...**ప్రతి ఏటా నాయుడుపేటతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి విగ్రహాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కుల, మత, రాజకీయ భేదాలకు అతీతంగా ప్రజలు ఒక్కచోట చేరి భక్తిశ్రద్ధలతో ఉత్సవాల్లో పాల్గొనడం ఈ వేడుకలకు ప్రత్యేకతగా నిలుస్తోంది.

**ఏడు రోజుల పాటు ఆధ్యాత్మిక సందడి...** ఈసారి కూడా ఏడు రోజుల పాటు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. భారీ విగ్రహం, ఆకట్టుకునే సెట్టింగ్, ప్రత్యేక అలంకరణలతో ఈ ఏడాది ఉత్సవాలు నాయుడుపేటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే అవకాశం ఉంది.

**ఉత్సవాలపై పెరుగుతున్న ఆసక్తి...** ఉత్సవాలు సమీపిస్తున్న కొద్దీ పట్టణంలో సందడి పెరుగుతోంది. భారీ సెట్టింగ్ ఎలా ఉండబోతుంది? విగ్రహం ఏ రూపంలో దర్శనమివ్వనుంది? అనే ఆసక్తి ప్రజల్లో నెలకొంది. రాజేష్ నేతృత్వంలో జరుగుతున్న భారీ ఏర్పాట్లు పూర్తయితే నాయుడుపేటలో ఈ ఉత్సవాలు మరోసారి ప్రత్యేక చర్చగా మారడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# కనిగిరిని కరువు మండలంగా ప్రకటించాలి.

## సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి పందిటి మోహన్.



కనిగిరి స్వర్ణ సాగరం సెప్టెంబర్ 11

రాష్ట్రవ్యాప్తంగా ఎలినినో ప్రభావంతో వర్షాలు పడక కరువు తాండవం చేస్తుందని ప్రజలకు కనీస అవసరాలు తీరే పరిస్థితి కనిపించడం లేదని, ఉపాధి దొరకడం కష్టతరంగా మారిందని కనిగిరి నియోజకవర్గం లోని ఆరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సిపిఐ కనిగిరి నియోజకవర్గం సహాయ కార్యదర్శి పందిటి మోహన్ కోరారు. శుక్రవారం కనిగిరిలోని ఎమ్మార్వో కార్యాలయం వద్ద సిపిఐ ,ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, చేతి వృత్తుదారుల సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన అనంతరం డిటి కి నియోజకవర్గాన్ని కరువు మండలాలుగా ప్రకటించాలని అర్జీ అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలినోనిన్ ప్రభావంతో వర్షాలు పడటం లేదని అందులో భాగంగా కనిగిరి నియోజకవర్గంలోని 6 మండలాలు ఒక్క ఎకరా రైతులు సాగు చేయలేకపోతున్నారని ఎలిని న్ తో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కూలీలకు సరైన పని దొరకక పొట్ట చేత పట్టుకొని సుదీర ప్రాంతాలకు వలస వెళ్లిసి ఉన్న పరిస్థితి ఉందని ఈ ప్రాంతం కరువు ప్రాంతం కనుక అనేకమంది బేలుదారి పనులకు ఇతర రాష్ట్రాలు వెళ్లి బతుకుతున్నారని కొద్దిపాటి మనది ఇక్కడ జీవిస్తున్నప్పటికీ వారికి కూడా జీవనోపాధి సరిగా దొరకటం లేదని వర్షబావ పరిస్థితులలో జీవనం సాగించడం ఇబ్బందికరంగా కష్టతరంగా మారిందని ఈ పరిస్థితుల్లో అధిగమించేందుకు కరువు సహాయక చర్యలు చేపట్టాలని కరువు భృతిని ప్రకటించాలని మార్కాపురం జిల్లాలోనీ 21 మండలాలలో కరువు పనులను ప్రారంభించి ఉపాధి హామీ ద్వారా 200 రోజులు పని దినాలు కల్పించాలని ప్రతి మనిషికి 600 రూపాయలు కూలి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పసుపసుకులకు దాన అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మీరావలి, ఖాజావలి, బ్రహ్మం, యేసయ్య, శేషాద్రి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని రక్షించాలని విద్యార్థుల ప్రదర్శన.. మట్టి గణపయ్యలతో ఊరేగింపు



స్వర్ణ సాగరం పొదలకూరుసెప్టెంబర్ 11

“మట్టి గణపయ్యలను పూజిద్దాం – పర్యావరణాన్ని రక్షిద్దాం” అంటూ పొదలకూరు మండలం బి. చెర్లోపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం ప్రత్యేక ఊరేగింపు నిర్వహించారు.విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి చెరువు మట్టిని సేకరించి స్వయంగా వినాయకుని విగ్రహాలను తయారు చేశారు. అనంతరం ఆ మట్టి విగ్రహాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి, గ్రామస్తులకు పంచారు.ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను ఉపయోగించాలని విద్యార్థులకు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సుధాకర్ రావు, పేరెంట్ కమిటీ చైర్మన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అక్షర జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



స్వర్ణ సాగరం - నాగలాపురం, సెప్టెంబర్ 11:

నాగలాపురం పట్టణంలోని టీ.ఆర్.ఆర్.కల్యాణ మండపంలో అక్షర జూనియర్ కళాశాల నిర్వాహకులు ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి గోపాలరెడ్డి,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం రవి,రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,మిమిక్రీ కళాకారుడు మయ్యూరు బాలసుబ్రమణ్యం హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణ,పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు,వినోద కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.దీంతో కళాశాల ప్రాంగణంలో సందడి నెలకొంది.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రేమ్ కుమార్,కళాశాల డైరెక్టర్ ఉదయ్ కుమార్,అధ్యాపకులు ఢిల్లీ, లావణ్య, అంబేద్కర్ స్రవంతి,వెన్నెల,మధుస్వి, రేవతి, జనని,ప్రవళిక,ఇందుమతి, సురేష్,అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

# శ్రీ గాయత్రి స్కూల్లో ఈనాడు ప్రతిభా పోటీలు!




స్వర్ణ సాగరంపొదలకూరు, సెప్టెంబర్ 11:

పట్టణంలోని శ్రీ గాయత్రి స్కూల్లో గురువారం ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'సమాజంపై ఎల్-నినో ప్రభావం, ఎదురుకునే మార్గాలు' అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి టి. సంజన, 9వ తరగతి, రెండో బహుమతి కె. మోక్షిత ఏడో తరగతి, మూడో బహుమతి ఎం. వినూత్న ఎనిమిదో తరగతి విద్యార్థినీలు గెలుచుకున్నారు. విజేతలకు ఈనాడు సర్టిఫికెట్స్ తో పాటు బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈనాడు ప్రతినిధి, కరస్పాండెంట్ చైతన్య కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రబాబు, ఉపాధ్యాయులు శంకరయ్య, వెంకటేశ్వర్లు, జెర్సీ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రో.. పసిడి.. రూపాయి.. చివరకు దారెటు?

దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే మూడు కీలక అంశాలు ఒకేసారి ప్రతికూల దిశలో కదులుతున్నప్పుడు ఆందోళన చెందడం సహజం. పెట్రోల్, డీజిల్ ధరలపై ఒత్తిడి, పసిడి ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణత- ఈ మూడు పరిణామాలు ప్రస్తుతం సామాన్యుడి నుంచి వ్యాపార వర్గాల వరకు ప్రతి ఒక్కరినీ కలవరపెడుతున్నాయి. వీటికి తోడు అంతర్జాతీయంగా మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలు, పెరుగుతున్న ఉద్రిక్తతలు, ముడిచమురు మార్కెట్‌లో అనిశ్చితి వంటి అంశాలు పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి. ప్రశ్న ఒక్కటే- పెట్రో.. పసిడి.. రూపాయి.. చివరకు దారెటు? చమురు ధరల పెరుగుదల అనేది కేవలం వాహనదారుల జేబుపై పడే భారం కాదు. అది ఆర్థిక వ్యవస్థలోని దాదాపు ప్రతి రంగాన్నీ తాకే ప్రభావశీలమైన అంశం. భారతదేశం తన ఇంధన అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరిగినప్పుడు దిగుమతి బిల్లు పెరుగుతుంది. అదే సమయంలో దేశీయ కరెన్సీ బలహీనపడితే, విదేశీ మారకంలో చెల్లించాల్సిన మొత్తం మరింత భారమవుతుంది. అంటే చమురు ధర పెరగడం ఒక సమస్య అయితే, రూపాయి విలువ పడిపోవడం ఆ సమస్యను రెట్టింపు చేసే ప్రమాదాన్ని కలిగిస్తుంది. ఇంధన ధరల ప్రభావం రవాణా రంగంతో మొదలై వ్యవసాయం, పరిశ్రమలు, నిర్మాణ రంగం, సరఫరా వ్యవస్థ, రిటైల్ మార్కెట్ వరకు విస్తరిస్తుంది. లారీలు, బస్సులు, ట్యాక్సీలు, సరుకు రవాణా వాహనాల నిర్వహణ వ్యయం పెరిగితే దాని ప్రభావం చివరకు వస్తువుల ధరలపై పడుతుంది. రైతులకు డీజిల్ ధర పెరగడం అంటే సాగునీటి పంపులు, వ్యవసాయ యంత్రాలు, పంట రవాణా వంటి అనేక ఖర్చులు పెరగడమే. పరిశ్రమలకు ఇంధన వ్యయం పెరిగితే ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఉద్యమమే మందు ఉత్పత్తిదారుడు ఆ భారాన్ని పూర్తిగా భరించలేకపోతే వినియోగదారుడిపైనే కొంత భాగాన్ని మోపాల్సి వస్తుంది. ఇదే ద్రవ్యోల్బణానికి దారితీసే ప్రధాన మార్గాల్లో ఒకటి. ఇంధన ధరలు పెరిగినప్పుడు రవాణా ఖర్చులు పెరుగుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే ఆహారం నుంచి తయారీ వస్తువుల వరకు అనేక ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే చమురు ధరల కదలికను కేవలం పెట్రోల్ బంకుల వద్ద కనిపించే ధరలతో కొలవడం సరికాదు. దాని ప్రభావం కుటుంబ బడ్జెట్‌లోని అనేక అంశాలపై పరోక్షంగా కనిపిస్తుంది. ఇక రూపాయి విలువ విషయానికి వస్తే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడితే దిగుమతుల వ్యయం పెరుగుతుంది. చమురు మాత్రమే కాదు -ఎలక్ట్రానిక్ పరికరాలు, యంత్రాలు, కొన్ని పారిశ్రామిక ముడి పదార్థాలు, రసాయనాలు, ఇతర దిగుమతి ఆధారిత వస్తువుల ధరలపైనా ప్రభావం పడుతుంది. అయితే రూపాయి పతనానికి అంతా ప్రతికూలమే అని చెప్పలేం.



ఎగుమతిదారులకు కొంత ప్రయోజనం లభించే అవకాశం ఉంటుంది. కానీ దేశ ఆర్థిక వ్యవస్థలో దిగుమతుల ప్రాధాన్యం అధికంగా ఉన్న పరిస్థితుల్లో కరెన్సీ బలహీనత ద్రవ్యోల్బణ ఒత్తిడిని పెంచే ప్రమాదం మాత్రం విస్మరించలేనిది. ఈ నేపథ్యంలో బంగారం మరో ప్రత్యేక కథ చెబుతోంది. సాధారణంగా అంతర్జాతీయ అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, మార్కెట్లలో అస్థిరత పెరిగినప్పుడు పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గుచూపుతారు. బంగారానికి అలాంటి సమయంలో డిమాండ్ పెరగవచ్చు. దేశీయంగా రూపాయి బలహీనపడటం కూడా రూపాయి లెక్కల్లో బంగారం ధర పెరగడానికి కారణమయ్యే అవకాశం ఉంది. అందుకే ఒకవైపు స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు గురవుతుంటే మరోవైపు పసిడి ధరలు పైకి కదలడం కనిపిస్తుంది.బంగారం ధర ఎప్పుడూ ఒకే దిశలో పెరుగుతుందని భావించడం కూడా పొరపాటే. అంతర్జాతీయ వడ్డీ రేట్లు, అమెరికా డాలర్ బలం, కేంద్ర బ్యాంకుల విధానాలు, పెట్టుబడిదారుల సెంటిమెంట్, ప్రపంచ ఆర్థిక వృద్ధిపై అంచనాలు వంటి అనేక అంశాలు బంగారం ధరను ప్రభావితం చేస్తాయి. అందుకే రోజువారీ ధరల మార్పులను చూసి భయపడటం కన్నా, దీర్ఘకాలిక ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవడం అవసరం. మరోవైపు స్టాక్ మార్కెట్లలో కనిపిస్తున్న ఒడిదుడుకులు కూడా ఈ సమీకరణంలో భాగమే. ముడిచమురు ధరలు పెరిగితే దిగుమతి ఆధారిత కంపెనీల ఖర్చులు పెరిగే అవకాశం ఉంటుంది. రూపాయి బలహీనపడితే విదేశీ మారకపు రుణాలు లేదా దిగుమతులపై ఆధారపడే సంస్థలపై ఒత్తిడి రావచ్చు. అదే సమయంలో అంతర్జాతీయ పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను తగ్గిస్తే మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి పెరగవచ్చు. అయితే కొన్ని ఎగుమతి ఆధారిత రంగాలకు బలహీన రూపాయి అనుకూలంగా మారే అవకాశమూ ఉంది. కాబట్టి మార్కెట్‌లో ప్రతి రంగం ఒకే విధంగా ప్రభావితమవుతుందని భావించడం సరికాదు. అందువల్ల పెట్రో, పసిడి, రూపాయి అనే మూడు సూచికలను విడివిడిగా చూడటం కన్నా వాటి మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. చమురు ధరలు పెరిగితే దిగుమతి బిల్లు పెరుగుతుంది; దిగుమతి బిల్లు పెరిగితే రూపాయిపై ఒత్తిడి రావచ్చు; రూపాయి బలహీనపడితే దిగుమతులు మరింత ఖరీదవుతాయి; అంతర్జాతీయ అనిశ్చితి పెరిగితే బంగారం వైపు పెట్టుబడులు మళ్లవచ్చు; మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింటే స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతాయి. ఈ పరిణామాలన్నీ చివరకు సామాన్యుడి జీవన వ్యయంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కాబట్టి నేటి పరిస్థితి కేవలం ధరల పెరుగుదల కథ కాదు -ఆర్థిక స్థిరత్వానికి ఎదురవుతున్న పరీక్ష. తాత్కాలిక ఉపశమన చర్యలతోపాటు దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి పెట్టాల్సిన సమయం ఇది. పెట్రో మంటను తగ్గించాలి, రూపాయి విలువను నిలబెట్టే ఆర్థిక పునాదులను బలోపేతం చేయాలి, పసిడి ధరల ఊగిసలాట వెనుక ఉన్న అంతర్జాతీయ అనిశ్చితిని అర్థం చేసుకోవాలి. అప్పుడే ద్రవ్యోల్బణం నుంచి సామాన్యుడికి ఉపశమనం లభిస్తుంది. ప్రపంచ పరిణామాలు మన తలుపు తట్టకముందే వాటి ప్రభావాన్ని అంచనా వేసి సిద్ధపడటమే సమర్థ ఆర్థిక పాలన. లేకపోతే పెట్రో మంట, పసిడి మెరుపు, రూపాయి పతనం- మూడూ కలిసి దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త సవాలుగా మారే ప్రమాదం ఉంది. ప్రశ్న దారెటు? అనేదే కాదు; సరైన దారిని ఇప్పుడే ఎంచుకోగలమా? అన్నదే అసలు ప్రశ్న

# సమష్టి స్వరం సాధ్యమేనా!

రష్యా--ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఇరాన్‌తో అమెరికా లడాయి, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు వగైరాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్ని ఊపిరాడకుండా చేస్తున్న తరుణంలో న్యూఢిల్లీలో శని, ఆదివారాల్లో బ్రిక్స్ దేశాల 18వ శిఖరాగ్ర సదస్సు జరగబోతోంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు ఇప్పటికే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ రాగా... చైనా అధ్య క్షుడు షీ జిన్‌పింగ్ శనివారం చేరుకుంటారు. ఆయన ఏడేళ్ల తర్వాత మన దేశం వస్తున్నారు. ఇక ఇరాన్ అధ్యక్షుడొకరు భారత్‌కొచ్చి ఎనిమిదేళ్లవుతుండగా, పెజెష్కియాన్ అడుగుపెట్టారు. ప్రధాని నరేంద్ర మోదీతో పుతిన్ ద్వైపాక్షిక సమావేశం జరగటం,ఆ వెంటనే పెజెష్కియాన్ కూడా ఆయనతో ద్వైపాక్షిక భేటీ కావటంతో పాటు, తదనంతరం జరిగిన బ్రిక్స్ బిజినెస్ ఫోరం సమావేశంలో కూడా పాలుపంచుకోవటంతో దౌత్య సందడి ముందే మొదలైనట్టయింది. ఆవిర్భవించిననాడు బ్రిక్స్‌వి బుడి బుడి అడుగులే. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాల విదేశాంగమంత్రులు 2006లో తొలిసారి సమావేశమై కూటమిగా ఏర్పడాలని నిర్ణయించారు. 2009లో తొలి శిఖరాగ్ర సమావేశం జరిగింది. దక్షిణాఫ్రికా 2011లో చేరాక చివరిలో 'ఎస్' చేరి బ్రిక్స్ అయింది. అటుపై వరసగా ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ, ఇండొనేసియాలు వేర్వేరు సంవత్సరాల్లో చేతులు కలిపాయి. మొత్తంగా ఇది 20 దేశాల కూటమిగా రూపొందింది. ప్రపంచ జనాభాలో బ్రిక్స్ దేశాల వాటా 49.5 శాతం. ప్రపంచంలోని నాలుగోవంతు భూభాగం దీని సొంతం. ప్రపంచ జీడీపీలో దాదాపు 30 శాతం వాటా. వాణిజ్య ఎగుమతుల్లో 21.6 శాతం, దిగుమతుల్లో 17.3 శాతం వాటా ఈ దేశాలదే. ప్రపంచ ఇంధన ఉత్పత్తిలో బ్రిక్స్ వాటా 40 శాతం. కొనుగోలు శక్తిలో జీ7 దేశాలకన్నా బ్రిక్స్ దేశాలదే అధికం. ప్రపంచ బ్యాంకుకు ప్రత్యా మ్నాయంగా పేద దేశాలకు తోడ్పడే సుస్థిర పట్టణాభివృద్ధి ప్రణాళిక, మౌలిక సదుపాయాలపై సూచనలివ్వటం, వాటి వ్యయానికి నిధులు సమకూర్చటం తదితరాలను చైనాలోని షాంఘైలో ప్రధాన కార్యాలయం ఉన్న బ్రిక్స్‌కు చెందిన న్యూ డెవెలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) చూస్తోంది. సభ్యదేశాల జాతీయ కరెన్సీల్లో వాణిజ్యం నెరపుతూ డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవటం, చెల్లింపులకోసం స్విఫ్ట్ వంటి పేమెంట్ విధానంలోకాక 'బ్రిక్స్ పే' ద్వారా లావాదేవీలు జరపటం




ఇప్పటికే మొదలయ్యాయి. ఇన్నివిధాల సహాయ సహకారాలు కొనసాగే బ్రిక్స్ ఎప్పటికీ ఇలాగే కొనసాగుతుందా అనే సంశయం చాలా మందికి ఉంది. ఎందుకంటే ఈ కూటమిలోని దేశాలే వేరే కూటముల్లో ఉన్నాయి. సౌదీ అరేబియా, యూఏఈ అమెరికా కనుసన్నల్లో నడుస్తాయి. పశ్చిమాసియా యుద్ధంలో అమెరికాకు సహకరిస్తూ ఇరాన్‌కు వ్యతిరేకంగా ఉన్నాయి. భారత్, చైనాల మధ్య సరిహద్దు వివాదాలు సరేసరి. అయితే ఆగిపోవటం కన్నా అడుగు ముందుకేయటమే అందరికీ ప్రయోజనకరం. కలిసి పనిచేసే సంస్కృతి పెంపొందటంవల్ల అపోహలు తొలగే అవకాశం ఉంటుంది. దగ్గరయ్యేందుకు వీలుంటుంది. సమష్టి కార్యాచరణ అవసరమైన రంగాలు చాలానే ఉన్నాయి. ఉగ్రవాదం, సైబర్ సెక్యూరిటీ, ఐక్యరాజ్యసమితిని బహుళ ప్రాతినిధ్య సంస్థగా చేయాలన్న డిమాండ్ వగైరాల్లో ఈ దేశాలు సమష్టిగా పనిచేయొచ్చు. వాతావరణం, విద్య, ఇంధనం, డిజిటల్ పేమెంట్ వేదికలు వగైరాల్లో సహకరించుకోవచ్చు. అలాగని కల్లోల కాలంలో కూటములు మనుగడ అంత సులభమేమీ కాదు. తమపై అమెరికా ప్రకటించిన దురాక్రమణ యుద్ధాన్ని బ్రిక్స్ ఖండించాలని ఇరాన్ బలంగా కోరుకుంటోంది. అదే సమయంలో తమపై ఇరాన్ సాగిస్తున్న దాడుల్ని కూడా వ్యతిరేకించాలని సౌదీ, యూఏఈ ఆశిస్తాయి. అందుకే బ్రిక్స్ ఉమ్మడి ప్రకటన అంత సులభమేమీ కాదు. ఇటీవల బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సు నేరుగా అమెరికానూ, ఇజ్రాయెల్‌నూ ప్రస్తావించకుండా ఇరాన్‌పై దాడిని ఖండించింది. అక్కడైతే సౌదీ, యూఏఈ సభ్యదేశాలు కాదు. ఇక్కడ పరిస్థితి వేరు. ఈ సమస్యను బ్రిక్స్ ఎలా పరిష్కరించుకుంటుందో చూడాల్సివుంది. ఆ దేశాలకూ, ఇరాన్‌కూ మధ్య ఏదోమేర సామరస్యం సాధించగలిగితే, సమష్టి స్వరం వినిపించగలిగితే బ్రిక్స్ బలం మరింత పెరుగుతుంది.

# డప్పులెన్ని కొట్టినా భంగపాటు తప్పదు!

ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రత్యర్థిత్వం సహజం. అధికార పక్షం తన విధానాలను చెప్పుకోవచ్చు. ప్రతిపక్షం ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టవచ్చు. అవసరమైతే తీవ్రంగా విమర్శించవచ్చు. బాధ్యత గల పాలకపక్షం సానుకూలంగా స్వీకరించి, సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి. కానీ విమర్శల పట్ల విద్వేషంతో వ్యవహరించడం సరికాదు. తాజాగా అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జరుగుతున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నవి. ఈ పరిస్థితులు ఉత్పన్నం కావడానికి కారకులు ఎవరు? 6 గ్యారెంటీలు, 420 హామీలు, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపే అమలు చేస్తామని చెప్పి, 1000 రోజులైనప్పటికీ అమలు చేయకపోవడంతోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల పట్ల నిరసన వ్యక్తం చేయడానికి నల్ల టీషర్టులు ధరించి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీ గేటు బయటే అడ్డుకొని రోడ్డుమీదనే వారిపై దౌర్జన్యం చేసే అధికారం పోలీసులకు ఉన్నదా? అసెంబ్లీ బయట ఎలాంటి ఆందోళనలు, అల్లర్లు జరగకుండా బందోబస్తు నిర్వహించడానికి నియమితులైన పోలీసులకు శాసనసభ్యులు ఏ దుస్తులు ధరించి అసెంబ్లీకి రావాలని నిర్ణయించే అధికారం ఎవరిచ్చారు? ఇది పోలీసుల అత్యుత్సాహమా? లేక ముఖ్యమంత్రి మౌఖిక ఆదేశాలా? మహిళా ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, కోవ లక్ష్మి పట్ల పోలీసుల అనుచిత ప్రవర్తన దారుణం.

మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జీ.జగదీశ్‌రెడ్డిపై దౌర్జన్యానికి దిగి గాయపర్చిన పోలీసుల ప్రవర్తనను ఏ విధంగా అర్థం చేసుకోవాలి? తెలంగాణ ప్రదాత, బంగారు తెలంగాణ ఆవిష్కర్త కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్ చేసిన వ్యాఖ్యలను సమర్థించుకోవడం, ఆ వ్యాఖ్యలపై మండిపడుతూ బీఆర్ఎస్ నేతలు నిరసనలు చేయడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. దారుణమైన భాష, చావుడప్పు వంటి నిరసన పద్ధతులు రాజకీయాలను ఏ దిశకు తీసుకువెళు_న్నాయి? ప్రజలకు, భవిష్యత్తు తరాలకు ఏ దిశానిర్దేశం చేయనున్నాయనే విషయాన్ని తలచుకుంటేనే అసహ్యం వేస్తున్నది. అవమానాలతో ప్రతీకారం తీర్చుకోవడం అప్రజాస్వామికం. ఆ ఉద్యమం ప్రజల ఆకాంక్షల నుంచి పుట్టింది. అలాంటి రాష్ట్రంలో రాజకీయ నాయకులు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నది. ప్రత్యర్థిని శత్రువుగా చూడకుండా ప్రత్యర్థిగానే చూడాలి. అధికారం శాశ్వతం కాదు. ప్రతిపక్ష స్థానం కూడా శాశ్వతం కాదు. కానీ రాజకీయ విలువలు మాత్రం శాశ్వతంగా తరతరాలకు మిగులుతాయి. భవిష్యత్తు వర్గాలకు దిశానిర్దేశం చేస్తాయి. అందుకే రాజకీయ పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి.

పార్టీలు తమ నాయకులు, కార్యకర్తలకు రాజకీయ భాషపై స్పష్టమైన హద్దులు విధించాలి. శాసనసభ, శాసనమండలి చర్చలకు ఉన్నత ప్రమాణాలు తీసుకురావాలి. వ్యక్తిగత విమర్శల స్థానంలో విధానపరమైన పోరాటాన్ని ప్రోత్సహించాలి. ప్రజలు రాజకీయ నాయకుల నుంచి చావుడప్పులు కాదు.. చర్చలు కోరుతున్నారు.. దూషణలు కాదు.. దిశానిర్దేశం కోరుతున్నారు. ప్రత్యర్థుల పతనం కాదు.. రాష్ట్ర ప్రగతిని కోరుతున్నారు. రాష్ట్ర ఆవిర్భావ అనంతరం పదేండ్లు సాగిన రాజకీయాల వలె తెలంగాణ రాజకీయాలు మళ్లీ ఆ దిశగా అడుగులు పడుతాయని ఆశిద్దాం.2014లో



ఒకసారి సభలో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక విలువైన ప్రకటన చేశారు.

అదేమిటంటే సభలో విచక్షణారహితంగా ఆరోపణలు చేయడం కాదు. ఆ ఆరోపణలకు రుజువులుండాలి, లేనిపక్షంలో శిక్షలుండాలి అని. అయితే దానికి స్పందిస్తూ కొంతమంది కాంగ్రెస్ శాసనసభ్యులు అయితే చేసే ఆరోపణలకు, విమర్శలకు డాక్యుమెంట్లు చూపాలా? లేదా దస్తావేజులు కావాలా? అంటూ ఎద్దేవా చేశారు. చట్టం ప్రకారం ఎన్ని నిబంధలున్నప్పటికీ, నైతికతను పాటించకుండా సభను పక్కదారి పట్టించే నిరాధార ఆరోపణలు చేసి, ఎంత సంచలనానికి తెరలేపితే అంత పాపులారిటీ వస్తుందనుకోవడం ఆ శాసనసభ్యుల మానసిక దౌర్భల్యానికి, బాధ్యతారాహిత్య ప్రవర్తనకు నిదర్శనం. ఇవన్నీ చూస్తున్నపుడు ఒక విషయం స్పష్టమవుతుంది. త్యాగాల బాటలో నడిచిన వారికి, భోగాల నటనలు నేర్చిన వారికి ఆలోచనలో, ఆచరణలో ఎంత తేడా ఉంటుందో బోధపడుతుంది.

తెలంగాణ ఉద్యమం జరుగుతున్నపుడు కూ డా అవకాశవాద రాజకీయాలతో తెలంగాణ ఏ ర్పాటును ఆలస్యం చేసి వందలాది మంది యువకుల బలవన్మరణాలకు కారకులైన కాంగ్రెస్ వారే ఇప్పుడు తెలంగాణ పాలకులుగా అవతరించారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలతోనో సాధించుకున్న స్వరాష్ట్ర శాసనసభలో కూర్చున్నామన్న పవిత్రభావన, మర్యాదపూర్వక ప్రవర్తన పాలకవర్గ సభ్యులలో కొంతమందికి లేకపోవడం బాధాకరం. రోడ్డుపై నిలబడి.. తెలంగాణ శాసనసభ అనే బోర్డును చూసి నా గుండెలు ఆనందంతో ఉప్పొంగిపోయాయి అని ఉద్యమంలో సీరియస్‌గా పాల్గొన్న ఒక ఉపాధ్యాయుడు నాతో చెప్పిన మాటల్లో ఉన్న పులకరింత, భావోద్వేగం కనిపించింది. ఆయనకు తెలంగాణ పట్ల ఉన్న ఆరాధ్య భావనను స్పష్టంచేసింది. కానీ, వీరుల త్యాగాల పునాదులపై నిర్మించుకున్న సభలో శాసనసభ్యులుగా కూర్చున్న వారికి లేకపోవడం ఎంత భావదారిద్ర్యం? వీరు తెలంగాణ ఉద్యమంతో కానీ, సమాజంతో కానీ అనుసంధానం కాకపోవడమే ఇందుకు కారణం.

సొంత రాష్ట్రాన్ని సాధించుకోవడం, ఆత్మగౌరవాన్ని ప్రకటించుకోవడం, నాలుగున్నర కోట్ల ప్రజల అనేక ఆకాంక్షలు నెరవేర్చే సభకు ప్రాతినిధ్యం వహించడం ఇవేవి వారికి మహోన్నతమైనవిగా తోచడం లేదు. ఆ సంబురాన్నే వారు ఆస్వాదించడం లేదు. మహోన్నత ఉద్యమాన్ని సఫలీకృతం చేసి సాధించుకున్న చారిత్రక సందర్భంలో ఈ మట్టి, ఇక్కడి మనుషుల ఋణం తీర్చుకొనే నిర్ణయాత్మక పాత్రను తాము పోషించవలసిన కర్తవ్యాన్ని గుర్తెరిగే ఉద్వేగిక స్థితిలో వారు లేరు. కుట్రదారులతో కరచాలనం చేసి, కలిసి నడిచిన వారికి అస్తిత్వ స్పృహ ఉంటుందనుకోవడం కూడా అత్యాశే!

ఎవరు ఎన్ని శాపనార్థాలు పెట్టినా? ఎవరు ఎన్ని నిందలు వేసినా? కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని ఎవరు ఎన్ని ప్రగల్భాలు పలికినా? ఎవరు ఎన్నిసార్లు చావు డప్పు?పలు కొట్టినా, ఎన్నిరకాల విషం చిమ్మే ప్రయత్నాలు చేసినా కేసీఆర్ సంకల్పాన్ని ఎవరూ అడ్డుకోలేరు. ఆయన తిరిగి మళ్లీ అధికారంలోకి రావడాన్ని ఎవరూ ఆపలేరు. ఇది పరిణతి చెందిన తెలంగాణ సమాజం భావన. తెలంగాణ ఉద్యమ సందర్భంలోనూ ఆయనపై ముప్పేట దాడి చేశారు. కానీ, అతడే ఒక సైన్యమై తెలంగాణ ప్రదాతగా నిలిచాడు. ఇప్పుడు కూడా తెలంగాణ ద్రోహులు మళ్లీ అదే తరహా దాడిని కొనసాగించాలని చూస్తున్నారు.

తెలంగాణ సాధించడానికి తానొక్కడై మొదటి అడుగు వేశాడు. కోట్లాది పాదాలు ఆయన దారి లో అడుగులు కలిపాయి. తెలంగాణ సమాజమే అండగా నిలిచింది. ఇప్పుడు ఆ సమాజమే కేసీఆర్‌ను తిరిగి అధికారంలోకి తీసుకురావాలన్న దృఢసంకల్పంతో ఉన్నది. ఈ పవిత్ర కార్యంలో అడ్డు వచ్చే ప్రగతి నిరోధకులు, ప్రజల సంకల్ప పదఘట్టనల కింద తెలంగాణ వ్యతిరేకులు నలిగిపోక తప్పదు. కేసీఆర్ అంటే ఓర్వలేని వాళ్లు డప్పులెన్ని కొట్టినా, వారికి భంగపాటు తప్పదు. ప్రజల చేతుల్లో ప్రజాస్వామిక తీర్పులో గుణపాఠం తప్పదు! పరిణామాలన్నీ చూస్తున్న ప్రజానీకం సరైన సమయం కోసం వేచి చూస్తున్నది.ూవస్త్రఅంశ్రీఖ్‌ఆజవ దీక్షుఅష్ట్ర

పార్టీలు తమ నాయకులు, కార్యకర్తలకు రాజకీయ భాషపై స్పష్టమైన హద్దులు విధించాలి. శాసనసభ, శాసనమండలి చర్చలకు ఉన్నత ప్రమాణాలు తీసుకురావాలి. వ్యక్తిగత విమర్శల స్థానంలో విధానపరమైన పోరాటాన్ని ప్రోత్సహించాలి. ప్రజలు రాజకీయ నాయకుల నుంచి చావుడప్పులు కాదు.. చర్చలు కోరుతున్నారు.. దూషణలు కాదు.. దిశానిర్దేశం కోరుతున్నారు.




## ట్రైలర్ లేదు.. నేరుగా థియేటర్లోనే సాలిడ్ హైప్ ఇస్తాం..!

భారీ అంచనాలతో తెరకెక్కిన యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' (ఙష్ట్రవ్రాఖితీఖఎఱంవ) సినిమా ట్రైలర్ లేకుండానే విడుదలవ్వనుంది. గత కొన్ని రోజులుగా మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ వార్తను హీరో, నేచురల్ స్టార్ నాని ధ్రువీకరించారు. శుక్రవారం మీడియాతో చిట్‌చాట్‌లో ట్రైలర్ లేకుండానే వస్తున్నామని, నేరుగా థియేటర్‌లోనే ప్రేక్షకులకు, అభిమానులకు సాలిడ్ హైప్ ఇచ్చి ఇంటికి పంపిస్తామని నాని తెలిపారు. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబోలో వస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలున్నాయి. ఇప్పటికే 'ఆయా షేర్', 'యేష నాగుల కట్ట' పాటలు నెట్టింట వైరలవుతుండగా.. మునుపెన్నడూ లేనివిధంగా జడల గెటప్‌లో నాని పూనకాలు తెప్పించడం ఖాయమనిస్తోంది. అందుకని.. సినిమాలోని సస్పెన్స్‌ను మెయింటైన్ చేయడంతో పాటు ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచడానికి ట్రైలర్ లేకుండానే సినిమాను నేరుగా థియేటర్లలోకి తీసుకురావాలని చిత్రబృందం నిర్ణయించింది. ఈ విషయాన్ని హీరో నాని అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం మీడియాతో చిట్‌చాట్‌లో దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో కలిసి మాట్లాడిన నాని సినిమాలో తన జడల లుక్, వెయ్యి మందితో ఫైట్ వార్తలపై స్పష్టత నిచ్చారు. ఆన్‌లైన్‌లో, మీడియాలో ప్రచారం అవుతున్నట్టు.. నీళ్ల అడుగున ఫైట్ లేదని.. 1000 మందితో కూడా ఫైట్ సీన్ లేదని నేచురల్ స్టార్ వెల్లడించారు. అంతేకాదు.. 'సినిమాలో మీ జడల బరువు 6 కేజీలు ఉందా?' అనే ప్రశ్నకు నవ్విన నాని.. 'అంత బరువు లేదండి' అని చెప్పారు. ఈ చిత్రంలో ఒక్క ఫ్రేమ్ కూడా బోర్ కొట్టించదని పేర్కొన్న ఆయన.. సినిమా ఇంత బాగా రావడానికి యూనిట్‌లోని ప్రతిఒక్కరూ చెమటోడ్చారని తెలిపారు. స్క్రీన్ మీద ప్రతి సీన్‌లో టెక్నీషియన్ల కష్టం కనిపిస్తుందని ఆయన అన్నారు. షూటింగ్‌లో తనతో పాటు క్యారెక్టర్ ఆర్టిస్టులు కూడా గాయపడ్డారని, కానీ.. తన గాయాల గురించే మీడియాలో వార్తలు వచ్చాయని స్పష్టం చేశారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదలవ్వనుంది.

## తెలుగులోకి 'హనుమాన్ అంశ్'.. సెప్టెంబర్ 18న గ్రాండ్ రిలీజ్!



ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవితాధారంగా తెరకెక్కిన సంచలన హిందీ భక్తిరస చిత్రం 'హనుమాన్ అంశ్' ఇప్పుడు అధికారికంగా తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఎలాంటి భారీ అంచనాలు లేకుండా కేవలం రూ.2 కోట్ల చిన్న బడ్జెట్‌తో విడుదలై, బాక్సాఫీస్ వద్ద వంద కోట్ల రూపాయలకు పైగా వసూళ్లతో అఖండ విజయాన్ని సొంతం చేసుకున్న ఈ చిత్రాన్ని తెలుగులో గ్రాండ్ రిలీజ్ చేసేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ చిత్రాన్ని తెలుగులో సమర్పిస్తుండగా, ఫార్చున్ ఫోర్ సినిమాస్ సంస్థ తెలుగు థియేట్రికల్ విడుదలను చేపట్టింది. విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శోభినావ్ సత్య, విహాన్ శెడ్గే ప్రధాన పాత్రల్లో నటించారు. నీమ్ కరోలి బాబా భక్తుల భావోద్వేగాలను, ఆయన జీవితంలోని ముఖ్య ఘట్టాలను అద్భుతంగా ఆవిష్కరించిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను కూడా ఎంతగానో ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలోనే అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 18న అత్యంత భారీ స్థాయిలో తెలుగు తెరపైకి రానుంది.

## ప్రభాస్ 'ఫౌజీ' వాయిదా .. ఆ డేట్‌పై ఎన్ని సినిమాలు కన్నేసాయో తెలుసా?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక పీరియాడిక్ యాక్షన్ చిత్రం 'ఫౌజీ'. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ గతంలోనే ప్రకటించారు. అయితే సినిమా షూటింగ్ ఇంకా పూర్తికాకపోవడంతో అనుకున్న తేదీకి 'ఫౌజీ' వస్తుందా? అనే చర్చ మొదలైంది. 'ఫౌజీ' చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నట్లు సమాచారం. ప్రభాస్ కూడా సినిమాకు భారీగా కాల్షీట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. ఒకేసారి రెండు, మూడు చిత్రీకరణ బృందాలతో షూటింగ్ నిర్వహిస్తూ పనులను వేగంగా పూర్తి చేస్తున్నారని టాక్. సినిమాను డిసెంబర్ 3న విడుదల చేయాలనే విషయంలో చిత్రబృందం మాత్రం పూర్తి నమ్మకంతో ఉన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ నిర్మాణ పనులు, మిగిలిన చిత్రీకరణ, పోస్ట్ ప్రొడక్షన్ పనులను దృష్టిలో పెట్టుకుని విడుదల తేదీపై పరిశ్రమ వర్గాల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఒకవేళ 'ఫౌజీ' డిసెంబర్ మొదటి వారంలో విడుదల కాకపోతే.. ఆ ఖాళీని భర్తీ చేసేందుకు ఇప్పటికే కొన్ని సినిమాలు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.వాటిలో ముందుగా చెప్పుకోవాల్సింది విశ్వక్ సేన్ నటిస్తున్న 'లెగసీ'. పొలిటికల్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాను డిసెంబర్ 4న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీంతో డిసెంబర్ మొదటి వారంలో తన స్థానాన్ని ఈ సినిమా ముందుగానే ఖరారు చేసుకుంది. మరోవైపు దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే జంటగా నటిస్తున్న 'శ్రీ శ్రీ' సినిమా కూడా డిసెంబర్ మొదటి వారంలో విడుదలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.అలాగే యువ సామ్రాట్ నాగచైతన్య హీరోగా 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వృషకర్మ' డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రభాస్ లాంటి భారీ పాన్ ఇండియా స్టార్ సినిమా అదే సమయంలో విడుదలకు సిద్ధంగా ఉంటే.. విశ్వక్ సేన్, దుల్కర్ సల్మాన్, నాగచైతన్య సినిమాల నిర్మాతలు డిసెంబర్ మొదటి వారాన్ని ఎంచుకునే విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించేవారు. కాని ఆయన తప్పుకోవడంతో వీరు రేసులోకి వచ్చారు. 'ఫౌజీ' డిసెంబర్ నుంచి తప్పుకుంటే.. వచ్చే ఏడాది వేసవికి వస్తుందా అనే చర్చ కూడా ఇండస్ట్రీలో నడుస్తుంది.




## సంయుక్త మీనన్ బర్త్ డే టీజర్ విడుదల.. వీరనారి అవతారం లుక్‌కు ఫిదా అవుతున్న ఫ్యాన్స్!



నిఖిల్ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో సంయుక్త, నభా నటేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం దాదాపు రెండేళ్లుగా షూటింగ్ జరుపుకుని ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ఈ రోజు సంయుక్త మీనన్ బర్త్ డే సందర్భంగా 40 సెకన్ల టీజర్ విడుదల చేశారు. ఇందులో వీరనారి పాత్రలో సంయుక్త కనిపించిన తీరు, కత్తి యుద్ధాలు చేసిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇప్పటివరకు గ్లామర్, ఎమోషనల్ పాత్రల్లో కనిపించిన సంయుక్త.. 'స్వయంభు'లో మాత్రం పూర్తి భిన్నమైన అవతారంలో కనిపించబోతున్నట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. 'స్వయంభు' కథ చారిత్రక నేపథ్యంలో సాగనున్నట్లు టీజర్‌ను చూస్తే అర్థమవుతోంది. రాజ్యాలు, అంతర్యుద్ధాలు, ప్రజలను కాపాడేందుకు జరిగే పోరాటాలు, వీరత్వంతో కూడిన సన్నివేశాలతో సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలో సంయుక్త పోషిస్తున్న పాత్రకు కూడా కథలో కీలకం కానుంది. చేతిలో కత్తి పట్టుకుని యుద్ధరంగంలో పోరాడుతున్న ఆమె సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీరనారి గెటప్‌లో సంయుక్త లుక్‌కు అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. మరో హీరోయిన్ నభా నటేశ్ కూడా ఈ సినిమాలో యువరాణి పాత్రలో కనిపించనుంది. ఆ మధ్య విడుదలైన టీజర్‌లో ఆమె లుక్ కూడా రాజసం ఉట్టిపడేలా ఉంది. చారిత్రక నేపథ్యానికి తగ్గట్టుగా రూపొందించిన సెట్స్, వస్త్రధారణ, పాత్రల లుక్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. నిఖిల్ కూడా తన కెరీర్‌లో ఇంతకు ముందు చేయని తరహా పాత్రలో కనిపించనున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. భారీ యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగాలకు కూడా సినిమాలో ప్రాధాన్యత ఉన్నట్లు కనిపిస్తోంది. కమెడియన్ సునీల్ ఈ సినిమాలో పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. ఆయన పాత్ర ఎలా ఉండబోతుందనేది ఆసక్తిని కలిగిస్తోంది. చారిత్రక నేపథ్యానికి భారీ యాక్షన్, విజువల్స్, డ్రామాను జోడించి సినిమాను రూపొందించినట్లు కనిపిస్తోంది.

## వెంకీ - త్రివిక్రమ్ మూవీ అప్‌డేట్.. రేపు 'ఆదర్శ కుటుంబం' టీజర్!

టాలీవుడ్ స్టార్ హీరో విక్టరీ వెంకటేష్, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్: 47 / ాఖ 47) సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ సోషల్ మీడియాలో కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను రేపు మధ్యాహ్నం 12:00 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.
ఈ చిత్రంలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 2న గాంధీ జయంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. "నువ్వు నాకు నచ్చావ్", "మల్లీశ్వరి" వంటి క్లాసిక్ ఫ్యామిలీ హిట్స్ అందించిన త్రివిక్రమ్ మాటలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో ఈ సినిమాపై సినీ వర్గాల్లోనూ, అభిమానుల్లోనూ విపరీతమైన క్రేజ్ ఉంది.

Edited Printed Published & Owned by Embeti Kameswari. And Printed at VSR Publishers and Printers, #1-176, Vakadu Village and Post, Vakadu Mandal, Tirupati District, Andhra pradesh. Published at VSR Publications, 1-176, Vakadu Village and Post, Vakadu Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR Embeti Kameswari, PRGI. NO. APTEL/26/A2367